ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

7

తిరుపతి

జిల్లా వార్తలు

శుక్రవారం 15 ఆగస్టు 2025



10వ పేజీలో

అర్ధ శతాబ్దపు అజ్ఞానాన్ని స్వతంత్రమందామా..
స్వర్ణోత్సవాలు చేద్దామా?

ఆత్మ వినాశపు అరాచకత్వాన్ని స్వరాజ్యమందామా..
సలాము చేద్దామా?

... స్వాతంత్ర్యం లభించి 50 ఏళ్లు అయిన సందర్భంగా దేశం సంబరాలు జరుపుకుంటున్న వేళ.. 1997లో సినీ కవి సిరివెన్నెల సీతారామశాస్త్రి దుఃఖ ధిక్కారపు స్వరంతో సమాజానికి పాట రూపంలో సంధించిన ప్రశ్నలు ఇవి.

... మరో 28 ఏళ్లు గడిచిపోయాయి. దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతూనే ఉన్నాయి. మరి... పరిస్థితులు మారుతున్నాయా? పేదల బతుకులు మెరుగవుతున్నాయా? పల్లెలు బాగుపడుతున్నాయా? ప్రశ్నలు మళ్లీ మళ్లీ సంధించుకోవాల్సిన సందర్భం ఇది. సంబరాలు జరుపుకొంటూనే సమస్యల్ని గుర్తు చేసుకుని పరిష్కారానికి సంకల్పం చెప్పుకోవాల్సిన సమయం ఇది.



స్వాతంత్ర్య సంబరాలకు స్వాగతం పలుకుతున్నట్టుగా గురువారం సాయంత్రం తిరుపతిలో విరిసిన ఇంద్రధనస్సు త్రివర్ణాలతో కనువిందు చేసింది.

జాన్వీ సందడి

తల్లి శ్రీదేవి పుట్టిన రోజున బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రతో కలిసి గురువారం తిరుమల శ్రీనివాసుడిని జాన్వీకపూర్ దర్శించుకున్నారు. పసిబిడ్డగా తాను తల్లిదండ్రులతో కలిసి తిరుమలలో తీసుకున్న ఫొటోను ఇన్‌స్టా ప్రొఫైల్ పిక్‌గా పెట్టుకున్నారు.



పంద్రాగస్టు వేడుకలకు సర్వం సిద్ధం

● 391మందికి ప్రశంసాపత్రాలు




సిద్ధమవుతున్న వేదిక



తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 14: తిరుపతిలోని ఎస్వీయూ స్టేడియంలో శుక్రవారం జరిగే 79వ జిల్లాస్థాయి స్వాతంత్ర్య దిన వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. గురువారం ఉదయం నుంచి జిల్లా అధికారులు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేపట్టి సాయంత్రానికి పూర్తి చేశారు. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు ఈ వేడుకలను వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి 11 శకటాలను.. 10 స్టాళ్లను సిద్ధం చేశారు. ఈ వేడుకలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేశామని కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో నరసింహులు తెలిపారు. మూడు రోజుల క్రితం కురిసిన వర్షానికి పోలీసు పరేడ్ మైదానం బురదమయం కావడంతో ఈ వేడుకలకు వేదికను ఎస్వీయూ స్టేడియానికి మార్చిన విషయం తెలిసిందే. గురువారం వర్షం నిలవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

కార్యక్రమాలిలా: శుక్రవారం ఉదయం 9గంటలకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తారు. 9.15గంటలకు స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు సన్మానం. ఆ తర్వాత జిల్లా ప్రగతిపై సందేశం ఇస్తారు. 9.35గంటలకు వివిధ శాఖల ప్రగతి శకటాల ప్రదర్శన, 10గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన 391మంది అధికారులు, ఉద్యోగులకు మంత్రి ప్రశంసాపత్రాలు అందజేస్తారు. అనంతరం స్టాళ్లను సందర్శిస్తారు.

జస్ట్.. రిహార్సల్స్



ఎస్వీయూ స్టేడియంలో పోలీసు పరేడ్ జరిగింది. ఎస్పీ హర్షవర్ధనరాజు జాతీయ జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేశారు. ఓపెన్ టాప్ జీపులో వెళుతూ పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఇదంతా శుక్రవారం స్వాతంత్ర్య దిన వేడుకలకు సంబంధించి గురువారం జరిగిన రిహార్సల్స్ మాత్రమే. ఈ సందర్భంగా వేడుకలకు సంబంధించి భద్రతపై ఎస్పీ సమీక్షించారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ చూడాలని సూచించారు. మరోవైపు రెండు గంటల పాటు బాంబు, డాగ్ స్క్వాడ్లతో ముమ్మరంగా తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రిజర్వు అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, రిజర్వు సీఐలు పాల్గొన్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

సదరన్ డిస్కం కార్పొరేట్ కార్యాలయంలో 39 మందికి పురస్కారాలు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని తొమ్మిది సర్కిళ్లలో కడపకు ఉత్తమ అవార్డు వచ్చింది. సదరన్ డిస్కం కంపెనీలో తొమ్మిది విభాగాల్లో పలు డివిజన్లు, సెక్షన్లకు ఉత్తమ అవార్డులు వచ్చాయి. కార్పొరేట్ కార్యాలయంలో 39 మందికి ఉత్తమ సేవా పురస్కారాలు లభించాయి. కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ కె.సంతోషరావు.. ఆయా సర్కిళ్ల పరిధిలో ఎంపికైన వారికి ఎస్ఈలు ఉత్తమ సేవా పురస్కారాలను అందిస్తారు.

నేడు పోలీస్ సేవా పతకాలు ప్రదానం

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసు, ఇంటెలిజెన్సు, అగ్నిమాపక, ఎర్రచందనం టాస్క్‌ఫోర్సులోని పలువురు అధికారులు, సిబ్బందికి ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మార్చి నెలలో వివిధ సేవా పతకాలు ప్రకటించింది. స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఈ పతకాలను అందజేయనున్నారు. వీరిలో ఉత్తమ సేవా పతకం కింద అలిపిరి ఏఎస్ఐ జి.భాస్కర్.. సేవా పతకాల్లో జిల్లా పోలీసు కార్యాలయంలో అడ్మిన్ ఏఎస్పీ వెంకట్రావు, సైబర్ క్రైం సీఐ వినోద్ కుమార్, వెస్ట్ పీఎస్‌లో ఏఎస్ఐ ఎల్.మునిరత్నం నాయుడు, తడ ఏఎస్ఐ శ్రీకుమార్ రెడ్డి, పిచ్చాటూరు ఏఎస్ఐ భక్తవత్సలరాజు, భాకరాపేట హెడ్ కానిస్టేబుల్ వెంకటసిద్దారెడ్డి, తిరుపతి రిజర్వు హెడ్ కానిస్టేబుల్ ఏడుకొండలు, ఎస్వీయూ పీఎస్ కానిస్టేబుల్ వెంకటరమణయ్య, రిజర్వు హెడ్ కానిస్టేబుళ్లు బ్రహ్మానాయక్, రమేష్‌బాబు, తిరుపతి వెస్ట్ నిర్మల, హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జునరావు, రిజర్వు హెడ్ కానిస్టేబుల్ ప్రసన్న అంజనేయులు తదితరులున్నారు.

నేటి నుంచే 'స్త్రీ శక్తి'

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ హామీల్లో ఒక్కటైన 'స్త్రీ శక్తి' పథకం శుక్రవారం సాయంత్రం అమలు కానుంది. ఆయా నియోజకవర్గాలలో ఎమ్మెల్యేల చేతుల మీదుగా మహిళల ఉచిత ప్రయాణం ప్రారంభించనున్నారు. తిరుపతి సీబీఎస్‌లో, చంద్రగిరికి సంబంధించి మంగళంలో, శ్రీకాళహస్తి, పుత్తూరు, పిచ్చాటూరు, వెంకటగిరి, గూడూరు, వాకాడు, సూళ్లూరుపేట బస్సుస్టేషన్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. మూడు లేదా రెండు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లను వరుసక్రమంలో ఉంచి పూజలు నిర్వహించి మహిళలను వరుసక్రమంలో ఎక్కిస్తారు. ఆ తర్వాత జెండా ఊపి బస్సును ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం సాయంత్రం 4- 5గంటల మధ్య జరగనుంది. ఇప్పటికే జీరో టిక్కెట్ జారీపై కండక్టర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. సాయంత్రం 5గంటల నుంచి ఈ-పాస్ యంత్రాలకు అనుమతి రానుంది. ఫొటోతో ఉన్న ఒరిజినల్ గుర్తింపు కార్డు నేరుగా గాని ఫోన్ ద్వారా గాని చూపించవచ్చు. గుర్తింపుకార్డులో చిన్న లోపం ఉన్నా ఉచితం వర్తించదు. మహిళలు తప్పనిసరిగా ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని ఆర్టీసీ అధికారులు కోరారు. మహిళల ఉచిత ప్రయాణం నేపథ్యంలో ప్రజారవాణాధికారి జగదీష్ ఆధ్వర్యంలో డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, సీఎంఈ బాలాజీ, అన్ని డిపోల మేనేజర్లు ముందస్తు చర్యలు చేపట్టారు.

యాంత్రీకరణ సాగుపై రైతులకు ప్రోత్సాహం

● జోనల్ ప్రత్యేకాధికారి ఎం.టి.కృష్ణబాబు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించాలని జోనల్ ప్రత్యేకాధికారి, రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు సూచించారు. గురువారం జిల్లా సమగ్రాభివృద్ధికి సంబంధించి కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. యాంత్రీకరణ ద్వారా రైతులు తక్కువ సమయంలో ఎక్కువ భూమిని సాగు చేయగలరని కృష్ణబాబు చెప్పారు. తద్వారా దిగుబడి కూడా పెరుగుతుందన్నారు. ఆ దిశగా రైతులను ప్రోత్సహించేలా అధికారులు కృషి చేయలన్నారు. అధునాతన పద్ధతులను అనుసరించేలా సంబంధిత అధికారులు అవగాహన కల్పించాలన్నారు. అందుకు అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. ఉద్యానశాఖ ద్వారా సబ్సిడీ కింద నీటి గుంతలు, డ్రోన్ వినియోగం మీద ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర, పీ4 వంటి ప్రాథమిక ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరుపై అధికారులు పురోగతి సాధించాలన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూజిల్లాలో 80 శాతం సబ్సిడీతో డ్రోన్లు అందించామన్నారు. రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమీక్షలో జేసీ శుభం బన్సల్, నగర పాలక కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు, అడిషనల్ ఎస్పీ రవి మనోహచారి, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు, పక్కన కలెక్టర్ వెంకటేశ్వర్

ఎంబీబీఎస్ అడ్మిషన్ల ప్రారంభం





ఎస్వీ వైద్య కళాశాలలో మొదటి అడ్మిషన్ పత్రాన్ని గుణభూషణ్‌కు అందజేస్తున్న ప్రిన్సిపల్ రవిప్రభు - స్విమ్స్‌లో మొదటి అడ్మిషన్ పత్రాన్ని సాయిశ్రీనిత్యకు అందజేస్తున్నడైరెక్టర్ ఆర్వీకుమార్

తిరుపతి(వైద్యం), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాలలో నీట్ ర్యాంకర్ల అడ్మిషన్లు మొదలయ్యాయి. కళాశాల ప్రిన్సిపల్ రవిప్రభు గురువారం ఈ ప్రక్రియను ప్రారంభించారు. నీట్‌లో 4990 ర్యాంకు సాధించిన గాలి గుణభూషణ్(తిరుపతికి) కి మొదటి అడ్మిషన్ పత్రాలన్ని అందించి అభినందించారు. వైద్యవిద్యలో అడుగు పెట్టడం అదృష్టంగా భావించి బాగా చదివి పేదలకు చక్కటి వైద్యసేవలను అందించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ వెంకటేశ్వర్లు, డీఎస్ఎన్ మూర్తి, అరుణ్ బాబు పాల్గొన్నారు. స్విమ్స్ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ ఎంబీబీఎస్ అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించారు. నీట్‌లో ఆల్ ఇండియాలో 14,255 ర్యాంకు సాధించిన సాయి శ్రీనిత్య(కర్నూలు)కు ఆయన మొదటి అడ్మిషన్ పత్రాన్ని అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలోని 26 సీట్లకు గాను మొదటి రోజు ఒక విద్యార్థికి అడ్మిషను అందించామన్నారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నాగరాజు, వైస్ ప్రిన్సిపల్ ముతీశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



భక్తుల భద్రతే లక్ష్యంగా పటిష్ఠ ఏర్పాట్లు

● ఈవో శ్యామలరావు ఆదేశం

తిరుమల, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): తిరుమలలో సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు2వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో భక్తులు సంతృప్తికరంగా స్వామిని దర్శించుకునేలా, లక్ష్యంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశించారు. తిరుపతిలోని ఏడీ బిల్డింగ్‌లో గురువారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ.. గత బ్రహ్మోత్సవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి విజిలెన్స్, పోలీసు సిబ్బంది సమన్వయంతో పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. వాహనసేవలను ఇబ్బందులు లేకుండా వీక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలిపిరి చెక్‌పాయింట్‌లో అదనంగా 12 స్కానర్లను త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. గరుడసేవ రద్దీని దృష్టిలో పెట్టుకుని ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. తిరుమల, తిరుపతిలో పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించాలన్నారు. అన్ని ప్రాంతాల్లో సైన్‌బోర్డులు, సూచిక బోర్డులుఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపుఈవో వెంకయ్యచౌదరి(వర్చువల్‌గా), సీవీఎస్వో మురళీకృష్ణ, ఎఫ్ఎఅండ్ సీఏవో బాలాజీ, వీజీవో రాంకుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

పవన్‌పై దాడి కేసులో 8 మంది అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో పవన్‌కుమార్‌పై దాడి చేసిన కేసులో ఎనిమిది మంది నిందితులను గురువారం అరెస్టు చేసి రిమాండుకు పంపారు. దీంతో మొత్తం అరెస్టయిన వారి సంఖ్య పదికి చేరింది. తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం తెలిపిన ప్రకారం.. పవన్‌ను విచక్షణారహితంగా కొడుతున్న దినేష్ వీడియో వైరల్ అయిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇతడే ఏ1. చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం అట్లవారిపల్లెకు చెందిన దినేష్ తిరుపతిలోనే ఉంటున్నాడు. అరెస్టయిన వారిలో ఇంకా గంగాధరనెల్లూరు మండలం వేల్కూరుకు చెందిన రేవంత్‌రాజు, ఓజిలికి చెందిన అజయ్‌కుమార్, తిరుపతిలోని మంచినీళ్లగుంటకు చెందిన మలిశెట్టి హరికృష్ణ, పులిచెర్ల మండలం బండారువారిపల్లెకు చెందిన ప్రవీణ్‌కుమార్, చౌడేపల్లె మండలం పరికిదొనకు చెందిన కిశోర్‌బాబు, సదుం మండలం పాలమందకు చెందిన మధు, సత్యసాయి జిల్లా నల్లచెరువు మండలం కడపలవారిపల్లెకు చెందిన సాయికిరణ్ ఉన్నారు. ప్రస్తుతం వీరిలో సాయికిరణ్ బెంగళూరులో ఉండగా, మిగిలిన వారంతా తిరుపతిలో నివాసం ఉంటున్నారు. ఈ ఎనిమిది మంది తిరుపతి రూరల్ మండలం రామచంద్రాపురం జంక్షన్ సమీపాన అవిలాల మైదానం దక్షిణ గేటు వద్ద ఉండగా అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. మిగిలిన నిందితులనూ త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. కాగా, ఈ కేసులో ఏ2, ఏ3 నిందితులైన అనిల్‌కుమార్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డిని ఇంతకు ముందే అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

నీటి సంరక్షణకు కృషి చేయండి



వీడియో కాన్ఫరెన్సుకు హాజరైన అధికారులు

రామచంద్రాపురం,ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అన్నా హజారేను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి నీటిబొట్టును ఒడిసి పట్టి నీటిసంరక్షణకు సాగునీటి సంఘాల అధ్యక్షులు, అధికారులు, రైతులు కృషి చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. గురువారం అమరావతి నుంచి సీఎం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సుకు ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు హాజరయ్యారు. వరద నీటినిల్వకకు నీటిపారుదలశాఖ, నరేగా పథకాల ద్వారా చెక్‌డ్యాములు, నీటికుంటలు, ఫారంపాండ్స్, రాక్ఫిల్, డ్యామ్స్, ట్రెంచెస్ నిర్మాణ పనులు చేపట్టాలని సీఎం సూచించనట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుత వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై సాగునీటి చెరువుల సంరక్షణకు కృషి చేయాలన్నారన్నారు. తహసీల్దారు మధుసూదన్‌రావు, ఎంపీడీవో కార్యాలయ పరిపాలనాధి చంద్రశేఖర్ రెడ్డి, నీటిపారుదలశాఖ ఏఈ యతిరాజులు, జయపాల్‌నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, సాగునీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఆడికృత్తిక ఉత్సవాలు ప్రారంభం



తిరుపతిరూరల్, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): తనపల్లెకొండపై బాల దండాయుధపాణి స్వామి ఆలయంలో గురువారం ఆడికృతిక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రారంభించారు. అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ ధ్వజస్థంబానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. హోమాన్ని నిర్వహించారు. శుక్రవారం భరణి నక్షత్ర వేడుకలు, శనివారం ఆడికృతిక ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు అర్చకుడు షణ్ముఖ స్వామి తెలిపారు. భక్తుల కావిడి చెల్లింపు కార్యక్రమాన్ని విశేషంగా జరగుతుందన్నారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు. ఆలయగోపురం, పరిసరాలను విద్యుదీపకాంతులతో తీర్చిదిద్దారు. ధ్వజారోహణ కార్యక్రమంలో నిర్వాహకులు విజయసింహారెడ్డి, బాలచంద్రారెడ్డి, హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

జడ్పీటీసీల విజయంపై టీడీపీ నేతల సంబరాలు



స్వీట్లు పంచుకుంటున్న టీడీపీ శ్రేణులు

భాకరాపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంతో గురువారం భాకరాపేటలో ఆ పార్టీ నాయకులు విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. టపాకాయలు పేల్చుతూ స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 ఏళ్ల తరువాత పులివెందుల ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడారన్నారు. టీడీపీ నాయకులు లోకనాథం, రఘునాథరెడ్డి, సుబ్రహ్మణ్యం, మౌలాలి, వెంకటరామయ్య, డిష్ మణి, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలుడి ధ్వజారోహణం

రామచంద్రాపురం,ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రామాపురం గోవర్ధనగిరిపై వెలసిన చిన్మయ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేణుగోపాలస్వామికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అనంతరం పుష్పపల్లకీపై స్వామివారిని ఊరేగించారు. కార్యక్రమంలో చిన్మయ మిషన్‌ముఖ్య సేవకులు ఫణీంద్రసాయి, చీఫ్ ప్యాటరన్ మబ్బు సూర్యనారాయణరెడ్డి,కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, పార్థసారధి, కుమార శేఖర్, జగదీష్, గజేంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు



ఎర్రావారిపాలెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి); స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం ఆటల పోటీలు జరిగాయి. ఏడు మండల పరిషత్ మోడల్ స్కూల్స్‌తో పాటు,ఉన్నత పాఠశాల పిల్లలకు పరుగు పందెం,ఫ్రాగ్ రేస్, లెమన్ టీ స్పూన్, వక్తృత్వ, వ్యాస రక్షణ పోటీలు నిర్వహించారు. నెరబైలు మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు జరిగిన పోటీలో ప్రథమ,ద్వితీయ ,తృతీయ స్థానాలు పొందిన వారికి శుక్రవారం బహుమతులు అందజేయనున్నారు. ఈ యేడాది ప్లాస్టిక్ జెండాల వాడకాన్ని నిషేధించారు.

తలకోన అభివృద్ధి పనుల భూమి పూజకు ఆహ్వానం

ఎర్రావారిపాలెం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి); తలకోన సిద్ధేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి పనులకు ఈ నెల 18న జరుపతలపెట్టిన భూమి పూజకు హాజరుకావాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మండల టీడీపీ నాయకులు,తలకోన ట్రస్ట్ చైర్మన్ సోమనాథరెడ్డిలు గురువారం ఆహ్వానించారు. ఎమ్మెల్యే నాని చొరవ ఫలితంగా తలకోన ఆలయం అభివృద్ధికి టీటీడీ నిధులను మంజూరు చేసింది. ఈనిధులతో ఆలయ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా జరిగే భూమి పూజా కార్యక్రమానికి టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ వెంకయ్యను కలిసి కార్యక్రమానికి రావలసినదిగా ఆహ్వానం అందించారు. అధికారులను కలిసిన వారిలో శిరివేలు రఘునాథ, దేవి,దేశిరెడ్డి రఘునాథ,సుధాకర్ నాయక్,విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు


తిరుపతి(విద్య), ఆగస్టు 14(ఆం ధ్ర జ్యోతి): స్థానిక పన్నీరుకాలువలోని చిన్మయ విద్యాలయంలో గురువారం ముందస్తు కృష్ణాష్టమి వేడకలు నిర్వహించారు. దీనిలో భాగంగా పలువురు చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలతో సందడి చేశారు. శ్రీకృష్ణుని ఊరేగింపు, ఉట్టికొట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ నీలిమ తెలిపారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు పండుగలు ప్రతీకలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేతివృత్తులతో ఆర్థికంగా ఎదగాలి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): మహిళలు చేతివృత్తుల్లో నైపుణ్యం పెంచుకుని ఆర్థికంగా ఎదగాలని టీడీపీ నేత మబ్బు దేవనారాయణరెడ్డి అన్నారు. నాస్ సంస్థ, జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్‌లో శిక్షణ పొందిన మర్రి చెన్నారెడ్డి, అంబేడ్కర్ కాలనీలకు చెందిన 45 మంది మహిళలకు గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. కొత్త బ్యాచ్ శిక్షణను ప్రారంభించారు. అనంతరం ఆ ప్రాంతంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఎండీ రహమతుల్లా షరీఫ్, డాక్టర్ ఎం.మోహన్, డాక్టర్ సుధాకర్, కె.ఆర్.వెంకటాచలం, లావణ్య పాల్గొన్నారు.

చంద్రగిరి

వినాయకస్వామి కుంభాబిషేకం



తిరుపతి రూరల్, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): దుర్గసముద్రంలోని ద్రౌపదీసమేత ధర్మరాజస్వామి ఆలయ ప్రాంగణంలోని వినాయకస్వామి ఆలయంలో గురువారం కుంబాభిషేకం నిర్వహించారు. గ్రామానికి చెందిన తిరుమణ్యం సిద్ధమునిరెడ్డి తన కుటుంబసభ్యులు ఆదెంలక్ష్మమ్మ, రంగారెడ్డి, తిరుమణ్యం మునెమ్మ జ్ఞాపకార్థంగా రూ.3.50 లక్షలతో ఆలయాన్ని నిర్మించారు. ఈక్రమంలో స్వామివారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఆలయధర్మకర్త మిట్టపల్లి ప్రసాద్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, దామోదర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

లారీని ఢీ కొన్న మినీ వ్యాను డ్రైవరుకు తీవ్ర గాయాలు



దెబ్బతిన్న మినీవ్యాను - గాయపడిన రాజశేఖర్

చంద్రగిరి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అగరాల సమీపంలో నారాయణ కళాశాల వద్ద జాతీయ రహదారిలో లారీని మినీవ్యాను ఢీకొంది. ఈ ఘటనలో వ్యాను డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు గురువారం తెల్లవారుజామున కడప నుంచి సోమలకు పూల మొక్కల లోడుతో మినీవ్యాను చంద్రగిరి అగరాల సమీపాన నారాయణ కళాశాల వద్ద ముందు వెళ్ళుతున్న లారీని ఢీకొంది. ఈప్రమాదంలో మినీవ్యాను ముందు భాగం బాగా దెబ్బతింది. డ్రైవర్ రాజశేఖర్‌కు గాయాలయ్యాయి. ఇతనిది పలమనేరు మండలం, కాల్వపల్లి. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో తిరుపతి రుయా సుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్థలం కేటాయింపునకు వినతి

ఎర్రావారిపాలెం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి); తిరుపతిలో రజక సంఘం భవనానికి స్థలం కేటాయించాలని ఆ సంఘం రాష్ట్ర డైరెక్టర్ అన్నసముద్రం మధుసూదన్ గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విన్నతిపత్రం అంద జేశారు. టీడీపీ నాయకులతో కలిసి ఆయన కలెక్టర్‌ను ఛాంబర్‌లో కలిసిరు.ప్రభుత్వ పరంగా కేటాయిస్తే ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సింగల్ విండో అధ్యక్షుడు శిరివేలు రఘునాథ, తలకోన ట్రస్ట్ చైర్మన్ సోమనాథరెడ్డి, దేవి, సుధాకర్ నాయక్ ఉన్నారు.



తిరుపతి పద్మావతీ అతిథిగృహంలో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కూటమి నేతలు నవీన్‌కుమార్‌రెడ్డి, భువన్‌కుమార్‌రెడ్డి

ఆటో కార్మికుల నిరసన



తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): యువగళం పాదయాత్ర సందర్భంగా ప్రస్తుత మంత్రి నారా లోకేశ్ ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర కోరారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆటో కార్మికులు మెడకు ఉరితాడు కట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జయచంద్ర, వేణు, ఆటో యూనియన్ నాయకులు మురళి, వాసు, బాదుల్లా, శేషు, శంకరయ్య పాల్గొన్నారు.

నేడు బహుమతుల ప్రదానం

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వేమన విజ్ఞాన కేం ద్రం ఆధ్వర్యంలో స్వాతంత్ర్యం, భారత రాజ్యాంగ స్ఫూర్తి, దేశాబివృద్ధి అంశంపై తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల విద్యార్థులకు నిర్వహించిన పోటీల విజేతలకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేయనున్నట్లు కేంద్రం నిర్వాహకుడు మల్లారపు నాగార్జున తెలిపారు. 10 వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారన్నారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు వెల్లడించారు.

నంది వాహనంపై ఆదిదంపతుల కటాక్షం



ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాని



నందివాహనంపై శివపార్వతులు

పాకాల, ఆగస్టు, 14(ఆంధ్రజ్యోతి): ఊట్లవారిపల్లె ఆనందగిరి (పాళ్యం కొండ)పై వెలసిన వల్లిదేవసేన సమేత కల్యాణ సుబ్రహ్మణ్యస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో గురువారం ఉదయం ధ్వజారోహణం, యాగపూజ వైభవంగా నిర్వహించారు. ఉభయదారులు ఏటుకూరి సుబ్బరామానాయుడు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి శర్మ ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి ఉభయదారులు అత్తులూరి ఆనంద నాయుడు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నంది వాహనంపై పార్వతీ పరమేశ్వరులను ఊరేగించారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ సోంపల్లి చంద్రశేఖర్ నాయుడు, కార్యనిర్వణాధికారి యువరాణి, జడ్పీటీసీ నంగా పద్మజా రెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ బోయపాటి నాగరాజు నాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు .శుక్రవారం ఉదయం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం కాణిపాకం నుంచి పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ తీసుకొచ్చిన పట్టువస్త్రాలను ఎమ్మెల్యే పులివర్తి నాని చేతుల మీదుగా సుబ్రహ్మణ్య స్వామి వారికి సమర్పించనున్నారు. గురువారం ఎమ్మెల్యే నాని సందర్శించి భక్తుల సౌకర్యాలను పరిశీలించారు. ఉత్సవ కమిటీ, అధికారులకు సూచనలు చేశారు. కాగా శుక్రవారం రాత్రి నెమలి వాహనంపై సుబ్రమణ్యంస్వామి ఊరేగనున్నారు.

గరుడ వారధిపై ట్రాఫిక్ జామ్



తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): గరుడ వారధి పైనుంచి ఆర్టీసీ బస్టాండులోకి వెళ్లే మార్గంలో గురువారం ట్రాఫిక్ స్తంభించింది. గంటల తరబడి బస్సులు ఆగిపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. సుబ్బలక్ష్మి కూడలి వద్ద ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని పోలీసు యంత్రాంగం కొన్ని రోజులుగా సాయంత్రం పూట బస్సులను గరుడ వారధి మీదుగానే బస్టాండుకు చేరుకునేలా చర్యలు తీసుకున్నారు. ర్యాంపు దిగువ నుంచి శ్రీహరి, శ్రీనివాస బస్టాండ్ల ప్లాట్‌ఫామ్స్‌కు చేరుకోవాల్సి ఉంది. అయితే స్థలాభావం, ఈ మార్గంలో వచ్చే బస్సుల సంఖ్య పెరగడం, బెంగళూరు పాయింట్ వద్ద చిత్తూరు నాన్‌స్టాప్ బస్సులు ఆగివుండడం వల్ల బస్సుల కదలిక నెమ్మదిస్తుండడంతో బారులు తీరుతున్నాయి. గురువారం సాయంత్రం గంటల తరబడి బస్సులు ముందుకు కదలకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. బస్సులు దిగి లగేజీలతో నడుచుకుంటూ అవస్థలు పడ్డారు.

'ఎన్నికల ఫలితాలు జగన్ అహంకారానికి చెంపపెట్టు'

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు జగన్ అహంకారానికి చెంపపెట్టు అని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద గౌడ్ పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలపై ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు డిపాజిట్లు కూడా రావని విమర్శించారు. ఈ ఎన్నికలపై జగన్ వ్యాఖ్యలు ఆయన పతనానికి నాంది అని అభిప్రాయపడ్డారు. 30 ఏళ్ల తర్వాత పులివెందులలో స్వేచ్ఛా వాతావరణంలో ఎన్నికలు జరిగాయని తెలిపారు. టీడీపీ విజయంతో ప్రజాస్వామ్యం గెలిచిందని పేర్కొన్నారు. అసెంబ్లీకి రాకుండా యలహంక ప్యాలెస్‌లో ఉంటున్న జగన్‌కు రాష్ట్ర ప్రజలు రాజకీయ సమాధి కడతారని పేర్కొన్నారు.

సెల్‌ఫోన్లు చోరీ చేసి ఖాతాల్లోని నగదు కాజేసి ..

● ముగ్గురు నిందితుల అరెస్టు ● 49 సెల్‌ఫోన్లతో పాటు రూ 2.80 లక్షలు స్వాధీనం



ఫోన్ల దొంగలను అరెస్టు చేసిన ఈస్ట్ పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని పలు ప్రాంతాల్లో నిద్రించే భక్తుల వద్ద సెల్‌ఫోన్లు చోరీచేసి.. బ్యాంకు ఖాతాల్లోని నగదును కాజేస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. డీఎస్పీ భక్తవత్సలం తెలిపిన ప్రకారం.. హైదరాబాదుకు చెందిన సి.హరికృష్ణ, అన్నమయ్య జిల్లా కురబలకోటకు చెందిన ఎరగ అశోక్, నెల్లూరు జిల్లా వరికుంట పాడుకు చెందిన గడ్డం కసిరెడ్డి బృందంగా ఏర్పడి తిరుపతి కేంద్రంగా మొబైల్ ఫోన్లు చోరీ చేస్తున్నారు. శ్రీనివాసం వద్ద నిద్రించే భక్తులను లక్ష్యంగా చేసుకుని చోరీకి పాల్పడేవారు. ఇటీవల హైదరాబాదుకు చెందిన ఆరుట్ల వెంకట్ వద్ద మొబైల్ ఫోన్లు అపహరించి ఆయన బ్యాంకు అకౌంటులోని నగదుకాజేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలతో నిఘా పెట్టారు. తిరుపతిలోని గోవిందరాజ స్వామి పుష్కరిణి వద్ద తిష్టవేసి మళ్ళీ చోరీలకు పాల్పడడానికి సిద్ధమవుతున్న ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. వీరి నుంచి 49 మొబైల్ ఫోన్లు, రూ 2.80 లక్షలు నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు సీఐ చెప్పారు.

ఎంబీయూలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

చంద్రగిరి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేట సమీంపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయం వద్ద గురువారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. 300 మీటర్ల పొడవున్న జాతీయ జెండాతో విద్యార్థులుర్యాలీలో పాల్గొన్నారు. వర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ ఎం.మోహన్‌బాబు, ప్రోఛాన్సలర్ విష్ణు, వైస్ ఛాన్సలర్ నాగరాజరామారావు, రిజిస్ట్రార్ డాక్టర్ సారథి, సినీనటుడు శివ బాలాజీ ఇందులో పాల్గొన్నారు. దేశభక్తి నినాదాలు చేసూ ర్యాలీగా విద్యార్థులు ముందుకు సాగారు. శివ బాలాజీ ముందు నడుస్తూ ఆకర్షణగా నిలిచారు. ఈసందర్భంగా మోహన్‌బాబు మాట్లాడుతూ మూడు రంగులు జెండా నీడలో దేశం అభివృద్ధి పథంలో ముందంజ వేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంబీయూ డీన్లు, ప్రిన్సిపాల్స్ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా వెంకటరామయ్య

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తిరుపతి సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానాలకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా వెంకటరామయ్యను నియమిస్తూ లీగల్ లెజిస్లేటివ్ అఫేర్స్ కార్యదర్శి గొట్టిపాటి ప్రతిభాదేవి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనమూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు.

పూర్వ విద్యార్థులు నిర్మించిన..హాస్టల్ భవనం నేడు ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థుల కోసం పూర్వ విద్యార్థులు నిర్మించిన పద్మావతి మహిళా హాస్టల్ భవనాన్ని శుక్రవారం ప్రారంభించనున్నారు. ఉదయం వీసీ అప్పారావు ప్రారంభిస్తారు.

రైల్వే క్వార్టర్స్‌కు తెలుగంగ తీసుకొస్తా : తుడా చైర్మన్

రేణిగుంట ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సీఆర్‌ఆర్‌ఎస్ ఉద్యోగుల క్వార్టర్స్‌కు తెలుగు గంగ పైప లైను ఏర్పాటుకు కృషి చేస్తానని తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సీఆర్‌ఎస్‌లో జరిగిన స్వచ్ఛత అభియాన్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. సీఆర్‌ఎస్ సీడబ్ల్యూఎం దేవ సహాయం, ఇతర రైల్వే ఉద్యోగస్తులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం సీఆర్‌ఎస్‌లోని ఎస్సీ ఎస్టీ, ఓబీసీ యూనియన్ కార్యాలయాలకు వెళ్లి బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నీటి సమస్యను రైల్వే ఉద్యోగులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రానున్న ఆరు నెలల్లో కమిషనర్‌తో చర్చించి తెలుగు గంగ పైప్‌లైన్ వేయించేందుకు కృషి చేస్తానని తెలియజేశారు. నూతన రోడ్లు వేయిస్తామని హామీ ఇచ్చారు. సీడీఎంఎస్ హిమజ బాయ్, ఏడబ్ల్యు పీవో శ్రీనివాసరావు, డీవైసీఎంఈ రమేష్, ఏడీఈ రాజమోహన్, మజ్దూర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



నగదు పురస్కారం అందజేస్తున్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు గ్రామీణ విద్య సంస్థ ఆధ్వర్యంలో కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం నగదు పురస్కారంతోపాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. కలెక్టరేట్ వేదికగా ఏడుగురు టెన్త్, ఒక ఇంటర్ విద్యార్థికి రూ.10వేలు చొప్పున అందజేశారు. నగరి, శ్రీకాళహస్తి, వెంకటగిరి మండలాల విద్యార్థులు ఇందులో ఉన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు జగదీష్, షమిబాషా పాల్గొన్నారు.

తిరుపతికి చేరిన మంత్రి ఆనం

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 14: ఎస్వీయూ స్టేడియంలో శుక్రవారం జరిగే స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గురువారం రాత్రి తిరుపతికి చేరుకున్నారు. పద్మావతి అతిథి గృహం వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్ ఆయనకు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. వీసీ కృష్ణమూర్తి ప్రారంభించారు. స్వాతంత్ర్య పోరాటాన్ని ఈ తరం జ్ఞాపకం చేసుకోవాలని కోరారు. తద్వారా స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని స్వీకరించి దేశాభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. ● పద్మావతి జూనియర్ కాలేజీలో.. హర్ ఘర్ తిరంగా ర్యాలీని కాలేజీ ప్రిన్సిపాల్ భువనేశ్వరీదేవి ప్రారంభించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు, సినీనటుడు సప్తగిరి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఐదేళ్లు జైలు

●రూ.ఆరు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ రాష్ట్ర ఎర్రచందనం కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి గురువారం తీర్పు ఇచ్చారు. నాగపట్ల ఈస్ట్ బీట్ చామలరేంజ్ పరిధిలో తమిళనాడు రాష్ట్రం తిరువన్నామలైకి చెందిన చిన్నస్వామి 2020వ సంవత్సరంలో అక్రమంగా ఎర్రచందనం తమిళనాడుకు తరలిస్తుండగా టాస్క్‌ఫోర్సు పోలీసులు, అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తి సాక్ష్యాధారాలు రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.ఆరు లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. నిందితుడిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.









ఎ.రంగంపేట సమీంపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయం వద్ద గురువారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. 300 మీటర్ల పొడవున్న జాతీయ జెండాతో విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. వర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ ఎం.మోహన్‌బాబు, ప్రోఛాన్సలర్ విష్ణు, వైస్ ఛాన్సలర్ నాగరాజరామారావు, రిజిస్ట్రార్ డాక్టర్ సారథి, సినీనటుడు శివ బాలాజీ ఇందులో పాల్గొన్నారు. చంద్రగిరిలోని బ్లూమింగ్ బడ్స్ స్కూల్ విద్యార్థులు 1500 అడుగుల పొడవుల గల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. స్కూల్ చైర్మన్ హితేంద్రనాథ్‌రెడ్డి సారథ్యం వహించారు. తిరుపతిలోని సత్యనారాయణపురంలోని శ్రీచైతన్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు గురువారం 500అడుగుల త్రివర్ణపతాకంతో ర్యాలీని నిర్వహించారు. ఏజీఎం జి.సురేష్, ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు. తిరుపతి సైన్స్ సెంటర్‌లో వెయ్యి అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. సైన్స్ సెంటర్ ఐజీఎన్‌పీపీ డైరెక్టర్ కేటీవీ రాఘవన్, ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాస్ నెహ్రూ, ఎడ్యుకేషన్ ఆఫీసర్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. -చంద్రగిరి,మంగళం,తిరుపతి (విద్య),ఆంధ్రజ్యోతి

శ్రీకృష్ణాష్టమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

ఇస్కాన్ అధ్యక్షుడు రేవతి రమణదాస్


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ టెంపుల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇస్కాన్ తిరుపతి అధ్యక్షుడు రేవతీ రమణ దాస్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్లను ఇస్కాన్ ప్రతినిధులు గురువారం ఆవిష్కరించారు. వేడుకల వివరాలను మీడియాకు వివరించారు. శుక్రవారం తెల్లవారుజామున 4.30గంటలకు మంగళ హారతి, నృసింహ కీర్తన, తులసిపూజ, హరేకృష్ణ మహామంత్ర జపం నిర్వహిస్తామన్నారు. 5.30 గంటలకు గోపూజ ఉంటుందని, సాయంత్రం 6.30 గంటలకు టీటీడీ వినాయక నగర్ మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. 16న శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవం నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 నుంచి 11.45 గంటల వరకూ రాధాగోవింద, అష్టసఖి, గిరిరాజ ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశామన్నారు. రాత్రి 11 గంటలకు రాధాగోవింద మహాభిషేకం చేపడతామన్నారు. 17వ తేదీ ఇస్కాన్ 129 వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తామన్నారు. ఉదయం 11 గంటలకు అభిషేకం, 12 గంటలకు శ్రీల ప్రభుపాద జీవితం, కృషిపై ప్రసంగ కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం 6.30 గంటలకు పలు విశ్వవిద్యాలయ అధికారులతో సందేశం ఉంటుందని తెలిపారు. పోలీసుల సూచన మేరకు ఈ సంవత్సరం ప్రత్యేక దర్శన పాసులు జారీ చేయలేదన్నారు. శ్రీకృష్ణాష్టమి వేడుకల ఏర్పాట్లకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. భక్తులందరికీ శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో పీఆర్వో లీలా పారాయణదాస్, బలభద్ర మాధవదాస్, నిత్యముక్తదాస్, విశ్వంభర గోపాలదాస్, రాధాకృష్ణప్రసాద్‌దాస్ పాల్గొన్నారు.

తుడా షాపుల వేలం

తిరుపతి, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి) : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) ఆధ్వర్యంలో గురువారం 18 షాపులకు వేలం నిర్వహించారు. 12 షాపులను పాటదారులకు కేటాయించారు. వీటిద్వారా నెలకు రూ1.12లక్షలు అద్దె వస్తుందని తుడా కార్యదర్శి ఎస్వీ శ్రీకాంత్‌బాబు తెలి పారు. మిగిలిన 6 షాపులకు ఎవరూ పాల్గొనలేదని చెప్పారు. భూసేకరణ అధికారి సుగుణ, డీఈ నరేష్‌బాబు, ఎస్‌డీఎం మురళీకృష్ణ పాల్గొన్నారు.

18నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ


స్మార్ట్ కార్డులను పరిశీలిస్తున్న అర్బన్ తహసీల్దారు, డీటీలు

తిరుపతి అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ మండలం పరిధిలో ఈ నెల 18వ తేదీ నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నారు. 66,243 కార్డులు రాగా వాటిని గురువారం అర్బన్ తహసీల్దార్ సురేష్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్లు కిరణ్, గంగయ్యలు పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే సోమవారం నుంచి వీఆర్వో ద్వారా ఇళ్లవద్దకే వచ్చి లబ్ధిదారులకు అందజేయనున్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా కార్డులు చేరవేయాలని ఆదేశించారు.

360మంది విద్యార్థినులకు ఆర్థికసాయం


విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తున్న బ్యాంకు అధికారులు

తిరుపతి అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంకు తిరుపతి ప్రాంతీయ కార్యాలయంలో గురువారం పేద విద్యార్థులకు డాక్టర్ అంబేడ్కర్ విద్యాజ్యోతి స్కాలర్‌షిప్ పంపిణీ చేశారు.ముఖ్యఅతిథిగా హాజరైన డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభావతి చేతుల మీదుగా అందజేశారు. కెనరా బ్యాంకు డీజీఎం రామ్మోహన్ మాట్లాడుతూ విద్యలో ప్రతిభ చాటిన ఎస్సీ, ఎస్టీ బాలికలను ఆర్థికంగా ఆదుకోవాలని ఏటా స్కాలర్‌షిప్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది 5 నుంచి 7వ తరగతి వరకు రూ.3వేలు, 8 నుంచి 10వ తరగతి వరకు రూ.5వేలు అందించామన్నారు. మొత్తం 60 పాఠశాలలకు చెందిన 360మందికి స్కాలర్‌షిప్ అవకాశం కల్పించామన్నారు. బ్యాంకు అధికారులు సంజీవ్‌కుమార్, రాథోడ్‌కుమార్ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, SWAMI SATTWATHANANDA, C/o R Venkatesh, Ramakrishna Mission Ashrama, Ramakrishna Marg, Opposite Iskcon, Vinayaka Nagar, Tirupati (Urban) having Aadhar Card No: 8435 0566 8157.My name is recorded in the records of Ramakrishna Mission as "SWAMI SATTWASTHANANDA". My name is recorded as "V. SRIKANTH S/o R. VENKATESH from my birth till 19.02.1999 when I was Ordained Sannyasa (Monkhood) in Ramakrishna Mission, Belur Math, Kolkata (a person receives Sannyasa Deeksha 10 years after actual joining. I joined the Ramakrishna order on 15.01.1989 with the name "V. SRIKANTH" (old name) and remained with same name till my Sannyasa Deeksha on 19.02.1999. I further state that SWAMI SATTWASTHANANDA (new name) alias V. SRIKANTH are one and the same, belong to me only. This may please be noted for all future correspondence, if any.

IN THE COURT OF THE II ADDITIONAL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS :: TIRUPATI

C.C.NO.135 OF 2019

V.Chandra Sekhar Reddy -- Complainant

And

T.Rajya Lakshmi -- Accused

NOTICE TO ACCUSED:-

T.Rajya Lakshmi, W/o.T.Chakravarthy, Hindu, Residing at Door No. 14-32-55-280,2nd Floor, Bandla Street, Tirupati.

Sir/Madam,

Please take notice that the above Case was filed against you by the Complainant under Section 138, 142 of The Negotiable Instruments Act, 1881 and the same has been posted on 28.08.2025 for your appearance. Please attend on that day before the Hon'ble court by 10.30 A.m. and file your objections if any. Otherwise the matter will be decided exparte. Hearing Date.28.08.2025

Sd/- M.JAYA CHANDRA REDDY
Advocate for Complainant
Tirupati. Cell No. 94407 63887

జడ్పీటీసీ స్థానాల్లో విజయంపై టీడీపీ సంబరాలు


స్వీట్ తినిపించుకుంటున్న టీడీపీ నేతలు

తిరుపతి, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి) : పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడం పట్ల గురువారం తిరుపతిలో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. ఏపీజీబీసీ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ సూచనల మేరకు టౌన్ క్లబ్ ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. బాణాసంచా కాల్చి, స్వీట్స్ తినిపించి సంబరాలు జరుపుకున్నారు. పులివెందులలో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిగితే ఫలితాలు ఏవిధంగా వస్తాయో వైసీపీ శ్రేణులకు తెలిసిందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, ఏపీయూఐడీసీ డైరెక్టర్ ఊకా విజయ్ కుమార్, నాయకులు సూరా సుధాకర్ రెడ్డి, ఊట్ల సురేంద్ర నాయుడు, చినబాబు, పాటకం వెంకటేష్, ఆనంద్ గౌడ్, హేమావతి, జాహ్నవి, రేఖ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా ఇంటింటి చెత్త సేకరణ

తిరుపతి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను, పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఉదయం నగరంలోని రామచంద్ర పుష్కరిణి, పట్నూలువీధి, గిరిపురం, జ్యోతి థియేటర్ కూడలి తదితర ప్రాంతాలను ఆమె కార్పొరేటర్ రేవతి, అధికారులతో కలసి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్వీయూ స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను పరిశీలిం చారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, తుడా ఈఈ రవీంద్ర, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, డీఈలు మధు, మహేష్, శిల్ప, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య ఉన్నారు.

హెచ్‌ఎస్ నాందేడ్-తిరుపతి ప్రత్యేక రైళ్ల పొడిగింపు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎస్ నాందేడ్-తిరుపతి మధ్య నడుస్తున్న వారాంతపు ప్రత్యేక రైళ్లను వచ్చే ఏడాది మార్చి 29వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాందేడ్‌లో ఈ ప్రత్యేక రైలు(07015)ప్రతి శనివారమూ సాయంత్రం 4.50 గంటలకు బయలుదేరి ముడికేడ్, బాసర్, నిజామాబాద్, లింగంపేట్, జగిత్యాల, కరీంనగర్, మధిర, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట స్టేషన్ల మీదుగా మరుసటి రోజు ఉదయం 11.30 గంటలకు తిరుపతికి చేరుకుంటుందని వివరించారు. అలాగే తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు(07016) ఆదివారం రాత్రి 7.45 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలోనే ప్రయాణిస్తూ మరుసటి రోజు సాయంత్రం 4 గంటలకు హెచ్‌ఎస్ నాందేడ్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈ మార్గంలో ప్రయాణికుల రద్దీ ఉండటంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

చెరువుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ శుభం బన్సల్, అధికారులు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 14: ట్యాంకుల సుందరీకరణలో భాగంగా జిల్లాలో 20 చెరువులను అభివృద్ధి చేసేలా చర్యలు చేపట్టాలని జేసీ శుభం బన్సల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి నుంచి సాగునీటి నిర్వహణపై కలెక్టర్లతో సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు హాజరయ్యారు. కాన్ఫరెన్సు అనంతరం జేసీ మాట్లాడుతూ సాగునీటి నిర్వహణ సమర్థవంతంగా ఉంచడంలో నీటి సంఘాల విధివిధానాలను వివరించారు. ముఖ్యంగా కాలువలు, వాగులు, వంకల నిర్వహణ, చెరువుల పూడికతీత, చెరువుల అనుసంధానం గురించి నీటి సంఘాల బాధ్యతలను గుర్తు చేశారు. ఈ సమావేశంలో తెలుగు గంగ చీఫ్ ఇంజనీర్ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఇరిగేషన్ ఎస్ఈ రాధాకృష్ణ, నీటిపారుదల శాఖ అధికారులు, నీటి సంఘాల అధ్యక్షులు హాజరయ్యారు.

అకడమిక్ కన్సల్టెంట్లకు నియామక ఉత్తర్వుల జారీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో అకడమిక్ కన్సల్టెంట్లకు 2025-26 విద్యా సంవత్సరానికి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. వీసీ అప్పారావు మాట్లాడుతూ అకడమిక్ కన్సల్టెంట్లకు 2019 తర్వాత పనితీరు సమీక్ష జరగలేదన్నారు. జూలై 1 నుంచి 5వ తేదీ వరకూ బోధన, పరిశోధన ఆధారంగా సమీక్ష నిర్వహించామన్నారు. నిపుణులతో మౌఖిక పరీక్ష నిర్వహించామన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి పాలకమండలి అనుమతితో 2025-26 విద్యా సంవత్సరానికి ఉత్తర్వులు జారీ చేశామన్నారు. 206 మందిని ఆర్ట్స్, సైన్స్, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్, ఫార్మసీ, ఎడ్యుకేషన్, ఇంజినీరింగ్ కాలేజీల్లో తీసుకున్నట్టు రిజిస్ట్రార్ భూపతి నాయుడు చెప్పారు.



శ్రీవారి సేవలో జాన్వీ కపూర్

బాలీవుడ్ నటీనటులు జాన్వీ కపూర్, సిద్ధార్థ్ మల్హోత్ర గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలిపిరి కాలిబాటలో బుధవారం రాత్రి తిరుమల చేరుకున్న వీరు గురువారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో మూలవిరాట్టును దర్శించుకున్నారు. ఆలయం వెలుపల జాన్వీ కపూర్, సిద్ధార్థ్ మల్హోత్రను చూసేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు.

హ్యాపీ బర్త్‌డే అమ్మ


తల్లిదండ్రులతో చిన్నారి జాన్వీ కపూర్

'హ్యాపీ బర్త్‌డే అమ్మ.ప్రతి అడుగులో నీ పేరు నా గుండెల్లో ఉంటుంది' అంటూ జాన్వీ కపూర్ గురువారం ఉదయం ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. ఆగస్టు 13న శ్రీదేవి పుట్టిన రోజు. దీనిని పురస్కరించుకుని తన చిన్ననాట తిరుమలలో తలనీలాలు సమర్పించి తల్లిదండ్రులు శ్రీదేవి, బోనీ కపూర్‌తో కలిసి ఉన్న ఫొటోను పోస్ట్ చేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సోలార్ ఫెన్సింగ్‌పై పడి రైతు మృతి


షణ్ముగం (ఫైల్)

సత్యవేడు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలం మదనంబేడులోని పొలాల వద్ద బుధవారం రాత్రి సోలార్ ఫెన్సింగ్‌పై పడి రైతు మృతిచెందారు. గ్రామస్తుల కథనం మేరకు.. పంటకు నీళ్లు పెట్టడానికని నాదముని కుమారుడు శ్రీరామ్‌షణ్ముగం పొలానికి వెళ్లారు. సోలార్ విద్యుత్ స్విచ్ ఆన్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా అదుపుతప్పి పొలానికి ఏర్పాటు చేసిన సోలార్ కంచెపై పడ్డారు. ఆ సమయంలో అక్కడ ఎవరూలేక పోవడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. ఎంత సేపటికీ షణ్ముగం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వచ్చి చూడగా మృతి చెంది ఉన్నారు. మృతదేహాన్ని ఇంటికి తరలించారు. కాగా షణ్ముగంకు భార్య, కుమారుడు ఉన్నారు. ఎమ్మెల్యే ఆదిమూలం గ్రామానికి చేరుకుని షణ్ముగం భౌతికకాయానికి నివాళులు అర్పించి, మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. షణ్ముగం కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు.


శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు


తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.31 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,859

తలనీలాలు సమర్పించినవారు: 33,344





స్వరాజ్య ఫలాలు ఇవేనా?



తెల్లదొరల చేతుల్లోంచి నల్లదొరల చేతుల్లోకి పాలన మారడాన్ని స్వతంత్రం అందామా..? అయితే మనకు 78 ఏళ్ల కిందటే స్వతంత్రం వచ్చింది!

పరాయి సంకెళ్లను తెంచేందుకు పోరాడిన యోధులు ఆశించిన భారతం ఇదేనా? కాదు..కాదు..ఎన్నటికీ కానేకాదు!

క్యాలెండర్‌లో కాయితాలు చిరిగిపోతున్నాయి తప్ప, ప్రజల కడగండ్లు తీరుతున్నాయా? అధికారం చేతులు మారింది తప్ప, జీవన ప్రమాణాలు పెరిగాయా? సొంత పాలనలోకి మారి ఏడు దశాబ్దాలు దాటి ఎనిమిదో దశాబ్దంలోకి అడుగుపెడుతున్నా పల్లెలు ఈసురోమంటూనే ఉన్నాయి. సేద్యం ఒక జూదంగా మారిపోయింది. స్వేదజలాలతో పంటలు పండించినా ఫలితం వెక్కిరిస్తుంది. ఉరితాళ్లలో, ఎండ్రిన్ డబ్బాల్లో పరిష్కారాన్ని అన్నదాతలు వెతుక్కుంటూనే ఉన్నారు. గుంతలు, గతుకులమయమైన రోడ్లు.. రోడ్లున్నా బస్సులు రాని ఊళ్లు.. మరణిస్తే జానెడు జాగా దొరకడం గగనంగా మారిన పల్లెలు.. స్వతంత్ర భారత వజ్రోత్సవాలకు దిష్టిచుక్కల సాక్ష్యంలా తిరుపతి జిల్లాలో ఇలా మిగిలే ఉన్నాయి. సంబరాలు చేసుకునే వేళ అయినా.. సంకల్పం చెప్పుకోవాలనే ఆశతోనే ఈ కథనం...

ఆంధ్రజ్యోతి - తిరుపతి జిల్లా నెట్‌వర్క్

● దశాబ్దాలుగా కన్నీరు పెడుతూనే ఉన్న పల్లెలు

వానొస్తే.. ఇంతే!

ఈ చిత్రం చూస్తే చాలు.. చస్తే ఆ ఊరి ప్రజలకు ఎంత చావొస్తుందో చెప్పడానికి. ఇది నాగలాపురం మండలం సురుటిపల్లి పంచాయతీ కస్తూరినాయుడు కండ్రిగలో దశాబ్దాలుగా ఉన్న పరిస్థితి. పల్లెకు దక్షిణంగా అరుణానది ఒడ్డున శ్మశానం వుంది. దీన్ని చేరుకోవాలంటే ఈ వాగును దాటాలి. వానకురిస్తే ఇది ఉధృతంగా ప్రవహిస్తుంది. వానాకాలంలో గ్రామంలో ఎవరైనా చనిపోతే ఓ భుజంపై పాడె మోస్తూ మరో భుజంతో ఈదుకుంటూ ఆ కాలువ దాటి శ్మశానానికి వెళ్లాలి. ప్రవాహ వేగం ఎక్కువగా వుంటే ఇరిగేషన్ అధికారులను బతిమలాడి సురుటిపల్లి వద్ద లాకులు మూసివేయిస్తారు. దాంతో కాలువలో ప్రవాహ వేగం తగ్గి మృతదేహాలను కాలువ దాటించి శ్మశానానికి చేర్చడానికి వీలవుతుంది. ఇది దశాబ్దాలుగా ఉన్న సమస్య. పాతిక మీటర్లు కూడా లేని ఈ కాలువ దాటడానికి చిన్న పాటి వంతెన లేదా కాజ్ వే నిర్మిస్తే సమస్య తీరుతుంది. పెద్దగా నిధులేమీ ఖర్చు కావు. అయినా సమస్య తీరడమే లేదు.


కస్తూరినాయుడు కండ్రిగలో శవంతో కాలువ దాటుతున్న గ్రామస్తులు (ఫైల్ ఫొటో)

నాగలాపురం మండలం సురుటిపల్లి పంచాయతీలోనే లింగమనాయుడు కండ్రిగదీ ఇదే సమస్య. అర కిలోమీటరు దూరం ఇలా పొలం గట్ల మీదుగానే శవాన్ని మోసుకుని వెళ్లాలి. పొలాలు తొక్కేస్తున్నారంటూ అడపాదడపా రైతుల అభ్యంతరాలతో గొడవలూ జరుగుతునే వున్నాయి. ఎన్ని అర్జీలిచ్చినా ఈ సమస్యకు పరిష్కారం చూపడంలేదు.


(ఫైల్ ఫొటో)

పక్షులేనా.. మనుషుల్ని పట్టించుకోరా?

పులికాట్ సరస్సును చీలుస్తూ సూళ్ళూరుపేట నుంచి శ్రీహరికోటకు తళతళ మెరిసే తారు రోడ్డు ఉంది. ఈ రోడ్డులోని అటకానితిప్ప నుంచి పది కిలోమీటర్ల దూరంలో ఉండే వేనాడుకు ప్రయాణం అంటే ప్రాణాంతకమే. పర్యావరణ చట్టాలు అనుమతించవు అంటూ 50 ఏళ్లకు పైగా సాకులు చెబుతూనే ఉన్నారు. ముస్లింలే లేని వేనాడులో ముస్లిం మత గురువు దావూద్ షాపీ సమాధి అల్లా తాత దర్గాగా ప్రసిద్ధి చెందింది. దీనిని సందర్శించేందుకు అనేక ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. అయినా పక్షులకు కష్టం అని ప్రజల్ని కష్టపెడుతూనే ఉన్నారు. వేనాడు పరిధిలోని మూల, అలాపత్రి, మట్టిగుంట, పల్లిపేట కుప్పం, మొక్కపల్లి సెంటర్ లలోని ప్రజల పరిస్థితి కూడా ఈ 78 ఏళ్లలో ఏమీ మారలేదు. షార్‌కి వర్తించని ఆంక్షలు మా పల్లెలకు మాత్రమే వర్తిస్తాయా అని నిప్పులు చిమ్ముకుంటూ ఎగిరే రాకెట్లను చూస్తూ ఇక్కడి ప్రజలు నిట్టూర్పులు వదులుతుంటారు.


వేనాడు వెళ్ళే మట్టి రోడ్డు దుస్థితి



వేనాడుకు తారు రోడ్డు నిర్మాణానికి నిబంధనలు అడ్డు కారాదని 1992లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేసిన రంగాచారి కమిషన్ సిఫారసు చేసింది. ఇందు కోసం 2002లో రూ. 4 కోట్లు, 2006లో రూ. 6 కోట్లు, రూ. 2017లో రూ. 3.50 కోట్లు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసింది. అయితే అటవీ శాఖ అనుమతులు మాత్రం రాలేదు. దీంతో ఈ నిధులన్నీ మురిగిపోయాయి.

- సుదర్శన్ మొదలియార్, న్యాయవాది, వేనాడు

వాటంబేడుకి బస్సు రాదు

తడ మండలం వాటంబేడు గ్రామం సూళ్లూరుపేట పట్టణానికి పది కిలోమీటర్ల దూరంలో వుంది. ఆ మార్గంలో గొల్లల మలుపు, పల్లిపలెం, గోపాల్‌రెడ్డిపాలెం, పాముల మిట్ట, వాటంబేడు, వాటంబేడు కుప్పం తదితర ఆరు గ్రామాలు వున్నాయి. ఈ మార్గంలో తారురోడ్డు కూడా వుంది. అయితే ఆర్టీసీ బస్సు మాత్రం నడవదు. కరోనా కాలంలో ఆగిపోయిన బస్సును మళ్లీ వేయనేలేదు.



సూళ్లూరుపేట నుంచీ వాటంబేడు నడుమ ఉన్న నున్నటి తారు రోడ్డు - వాటంబేడు గ్రామ కూడలి



ఇంతకు ముందు ఈ రూట్‌లోని గ్రామాల నుంచి స్కూళ్లకు, కాలేజీలకు ఆర్టీసీ బస్సులోనే పోయి వచ్చేవాళ్ల. ఇపుడు ఆటోలే దిక్కు.

- గద్దగుంట ప్రవీణ్, విద్యార్థి, వాటంబేడు



బస్సులో పది రూపాయల ఛార్జీతో సూళ్లూరుపేటకి చేరేవాళ్లం. ఇపుడు ఆటోకు రూ. 30 ఇస్తున్నాం. అయినా ఆటోలో భద్రత వుండదు.

- బోడి మాణిక్యం శెట్టి, వాటంబేడు కుప్పం






చిట్టమూరు మండలం గొల్లలనట్టు నుంచీ బురదగాలి కొత్తపాలెం వెళ్లే మట్టి రోడ్డు ఇలా..

వాకాడు మండలం మొనపాలెం నుంచీ తీర గ్రామాలకు 13 కిలోమీటర్ల గ్రావెల్ రోడ్డు దుస్థితి

అటవీ ఆంక్షల పుణ్యం ఈ రోడ్లు

చిట్టమూరు, చిల్లకూరు, వాకాడు మండలాల్లోని పలు సముద్రతీర గ్రామాలు అటవీ శాఖ ఆంక్షల చట్రంలో ఇరుక్కుపోయి మగ్గిపోతున్నాయి. కనీసం తారు రోడ్డుకు కూడా ఈ గ్రామాలు నోచుకోవడం లేదు. చిట్టమూరు మండల కేంద్రం నుంచీ బురదగాలి కొత్తపాలెం 13 కిలోమీటర్ల దూరంలో వుండగా బురదగాలి 14 కిలోమీటర్ల దూరంలో, కుమ్మరపాలెం 20 కిలోమీటర్ల దూరంలో వున్నాయి. ఈ గ్రామాలకు వెళ్ళాలంటే ఇప్పటికీ మట్టి రోడ్లే దిక్కు. తారు రోడ్లు వేయడానికి అటవీ శాఖ అనుమతించదు. సాధారణ రోజుల్లో దుమ్ము కొట్టుకుంటూ ప్రయాణించే గ్రామస్తులు వర్షాకాలంలో బురద, గోతులతో నిండిన రోడ్లపై పడుతూ లేస్తూ ప్రయాణాలు సాగిస్తున్నారు. వాకాడు మండలంలో మొనపాలెం, మాధవరం, పూడికుప్పం, చిన్నతోట, పూడిరాయిదొరువు, నవాబ్‌పేట, నెల్లిపూడిలకు కూడా అటవీ శాఖ ఆంక్షల కారణంగానే తారురోడ్లు లేవు. చిల్లకూరు మండలం పున్నపువారిపాలెం గ్రామానికి సైతం తారు రోడ్డు లేదు.



కాలం మారుతున్నా మేము మాత్రం జంతువుల్లాగా బతుకుతున్నాం. తారు రోడ్లు లేవు, సెల్ ఫోన్ టవర్లు లేవు. కనీసం నాణ్యమైన కరెంటు కూడా లేదు. ఎన్నేళ్లు గడుస్తున్నా మా బతుకులు ఇంతేనా?

- యర్రబోతు రాజగోపాల్‌రెడ్డి, పూడిరాయదొరువు



శ్రీహరికోటలో రాకెట్ కేంద్రం పెట్టాలని మమ్మల్ని ఖాళీ చేయమన్నారు. 1972లో పుట్టిన గడ్డ వదిలి వాకాడు మండలానికి వచ్చేశాం. శ్రీహరికోట నుంచి రాకెట్లు ఎగురుతున్నాయి కానీ, మా బతుకులు మాత్రం ఎదగడం లేదు. అదేమంటే వన్యప్రాణి చట్టం.. ఏమీ చేయలేం అంటారు. మా త్యాగానికి తగిన ఫలమే దక్కింది!

- మామిడి గోవిందయ్య, చిన్నతోట

మూడు మార్కెట్ కమిటీలకు
పాలకవర్గాల నియామకం

తిరుపతి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్రభుత్వం పాలక వర్గాలను ఏర్పాటు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వెంకటగిరికి పునుగోటి విశ్వనాథ్, గూడూరుకు చిల్లకూరు నీరజ, వాకాడుకు మర్రి ప్రమీల అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ పాలకవర్గాలు ఏడాది పాటు కొనసాగనున్నాయి.

వెంకటగిరి, ఆంధ్రజ్యోతి: వెంకటగిరి మార్కెట్ కమిటీకి గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఛైర్మన్‌గా పునుగోటి విశ్వనాథ్, వైస్ ఛైర్మన్‌గా కుని సూరి, సభ్యులుగా తాళ్ళూరు ప్రసాద్, రాపూరు శ్రీనివాసులు, వెలుగులేటి వెంకటేశ్వర్లు, సగ్గం మల్లీశ్వరి, చింతమాను వెంకటపతి, అరికట్ల శ్రీరాములునాయుడు, దండోలు పెంచలరెడ్డి, రంగినేని కోటేశ్వరరావు, నీలకంఠం మురళి, చిట్టిపు వెంకటాచలపతి, ఎస్.సుబ్రమణ్యం, ఎ.సుబ్బరామయ్య, కె.రవిశంకర్, వెంకటగిరి సింగిల్‌విండో ఛైర్మన్, వెంకటగిరి వ్యవసాయ శాఖ ఏడీ, మున్సిపల్ ఛైర్‌పర్సన్, జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి నియమితులయ్యారు.

గూడూరు, ఆంధ్రజ్యోతి: గూడూరు మార్కెట్ కమిటీ గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్, ఛైర్‌పర్సన్‌గా చిల్లకూరు నీరజ, వైస్ ఛైర్మన్‌గా సోమిశెట్టి చెందురామయ్య, సభ్యులుగా నెలటూరు సుప్రజ, మేకల కిషోర్, మనుబోలు కృష్ణయ్య, ఎస్‌కే మహమ్మద్ జాకీర్, మలల్లి శ్యామల, ఎస్‌కే పర్వీన్, పెజ్జాయి ప్రవీణ్ కుమార్ రెడ్డి, గాలి ప్రకాష్ నాయుడు, కీర్తిపాటి సుధ, కొడూరు కృష్ణమ్మ, పంట నిర్మలమ్మ, వేముల సునీల్, అరికట్ల మల్లిఖార్జునరావు, చిల్లకూరు సింగిల్ విండో ప్రెసిడెంట్, గూడూరు వ్యవసాయ శాఖ ఏడీ, కాండ్ర పంచాయతీ సర్పంచ్, జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారులను ప్రభుత్వం నియమించింది.

వాకాడు, ఆంధ్రజ్యోతి: వాకాడు మార్కెట్ కమిటీ గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్, ఛైర్‌పర్సన్‌గా మర్రి ప్రమీల, వైస్ ఛైర్మన్‌గా దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, సభ్యులుగా సిద్ధపురెడ్డి పోలమ్మ, పంత్రంగం వసంత్, బత్తిన ప్రమీల, చల్లా స్వాతి, మారంరెడ్డి జనార్ధనరెడ్డి, వాకా సిరిజ, బసవనూరు భాస్కర్, ఎ.యామిని, విన్నమాల మంజుల, కల్లూరు క్రాంతి, ఎస్‌కే మస్తాన్ బాషా, దొడ్డగ వెంకట్రమణ, ఎల్లపోతు రాజగోపాల్‌రెడ్డి, కోట మండలం తిన్నెలపూడి సింగిల్ విండో ఛైర్మన్, నాయుడుపేట వ్యవసాయ శాఖ ఏడీ, వెంకన్నపాలెం పంచాయతీ సర్పంచ్, జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి నియమితులయ్యారు.

'ఇరకం కుప్పం' గ్రామస్తులకు ఇళ్ల పట్టాల పంపిణీ

తడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తడ మండలం పులికాట్ సరస్సు మధ్యలోని ఇరకం కుప్పం గ్రామస్తులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ మేరకు తడలో గురువారం కార్యక్రమం నిర్వహించారు. మౌలిక సదుపాయాలు లేకుండా ఏళ్లతరబడి ఇక్కడి నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా పూడికుప్పం గ్రామానికి వలస వచ్చేందుకు నిర్ణయించుకున్నారు. ఆ గ్రామంలో ఇళ్ల స్థలాలు కేటాయించాలంటూ 2021లో అప్పటి వైసీపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పలు మార్లు అప్పటి ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. గతేడాది ఎన్నికల సందర్భంగా తాము ఇళ్ల స్థలాలు కేటాయిస్తామంటూ టీడీపీ నేతలు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక వైసీపీ నేత, పూడి సర్పంచి పరమశివరెడ్డి ఇళ్ల స్థలాల కేటాయింపు అడ్డుకుంటూ కోర్టులో కేసు వేశారు. కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చొరవ చూపి న్యాయస్థానంలో ఆ కేసు వీగిపోయేలా చేసి ఇళ్ల స్థలాల మంజూరుకు మార్గం సుగమం చేశారు. ఈ క్రమంలో గురువారం ఎమ్మెల్యే, కలెక్టర్ చేతుల మీదుగా ఒక్కొక్కరికి 2.5 సెంట్లు చొప్పున 172 మందికి పూడికుప్పం గ్రామంలో ఇళ్ల పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ద్వారా రూ.2.90 లక్షలు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే, కలెక్టర్ చెప్పారు. తాగునీటి సౌకర్యార్థం రెండు బోర్లు వేయిస్తామన్నారు. లక్కీడిప్ ద్వారా లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, ఆర్డీవో కిరణ్మయి, డీఎల్‌డీవో జాలిరెడ్డి, తహసీల్దార్ శరత్‌బాబు, టీడీపీ నాయకులు కామిరెడ్డి మురళి రెడ్డి, బొమ్మన్ శ్రీధర్, ఆకుతోట రమేష్, తిరుమూరు సుధాకర్ రెడ్డి, సంచి కృష్ణయ్య, నీల కంఠం, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తార్కిక ఆలోచనలే విజయానికి సోపానాలు

● యండమూరి వీరేంద్రనాథ్

తిరుపతి రూరల్, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): తార్కిక ఆలోచనల ద్వారా పోటీపరీక్షల్లో విజయాన్ని సాధించవచ్చని నవలా రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు యండమూరి వీరేంద్రనాథ్ పేర్కొన్నారు. ఎంఆర్‌పల్లెసర్కిల్‌లోని కౌటిల్యా ఇన్‌స్టిట్యూట్‌లో స్టెప్ ఫర్ సక్సెస్ అనే అంశంపై విద్యార్థులకు గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. వివిధ పోటీల్లో విజయానికి వ్యూహాలు, నాయకత్వ లక్షణాలు, ఏకాగ్రత, జ్ఞాపకశక్తికి మెళకువలు, మొబైల్‌ఫోన్ నుంచి విముక్తి, ఒత్తిడి నిర్వహణ వంటి విషయాలపై పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ..ఆరోగ్యం, కీర్తి, సంపద, ప్రేమ, ఉత్సాహం విజయానికి నిర్వచమన్నారు. మానసిక ఆరోగ్యమున్న వ్యక్తి భయం, దుఃఖం, కోపం అనే మూడు రకాల వ్యాధుల నుంచి బయటపడుతాడాన్నారు. వైఫల్యాలని విజయాలకు దారితీసే మెట్లుగా మార్చుకోవడమన్నది పాత పంథాఅన్నారు. వైఫల్యమే లేనంతగా కృషి చేయడమనది నేటి పోటీ ప్రపంచంలో కొత్త ఒరవడి అన్నారు. స్మార్ట్ ఫోన్లతో విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు. అనవసర స్నేహాల వల్ల ఉన్నతికి అడ్డుకట్టపడుతుందన్నారు. లీడర్‌షిప్, కామన్‌సెన్స్, కమ్యూనికేషన్, తెలివి లక్షణాలను కలిగి ఉంటే జీవితంలో ఉన్నతస్థాయికి ఎదుగుతారని విద్యార్థుల్లో చైతన్యం నింపారు. సంస్థ డైరెక్టర్ శ్రీధర్ తదితరులు మాట్లాడారు.



మాట్లాడుతున్న యండమూరి వీరేంద్రనాథ్

పుత్తూరు వార్తలు

భక్తులకు మెరుగైన సేవలందించాలి



ప్రమాణస్వీకారం చేస్తున్న పాలకమండలి

పుత్తూరు టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): భక్తులకు మెరుగైన సేవలందిస్తూ, ఆల యాభి వృద్ధికి కృషి చేయాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చినబాబు పేర్కొన్నారు. గురువారం పుత్తూరు పట్టణంలోని కామాక్షి సమేత సదాశివేశ్వరస్వామి దేవస్థానం పాలక మండలి ప్రమాణాస్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. అంతకుముందు ఆలయ కమిటీ చైర్మన్‌గా దిలీప్, సభ్యులుగా పార్తీబన్, మునికుమార్, శ్రీధర్, పూజిత, అమ్ముతవల్లి, సేతుమాధవన్, వాణితో ఆలయ ఈవో జయకృష్ణ ప్రమాణా స్వీకారం చేయించారు. చైర్మన్ దిలీప్ మాట్లాడుతూ ఆలయాభివృద్ధి కి కృషి చేస్తామన్నారు. తమకు ఈ బాధ్యతను అప్పగించిన ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు నిషిధ సురేంద్రరాజు, జనసేన నాయకులు మహేష్, టీడీపీ నాయకులు జీవ రత్నం నాయుడు, ధనపాల్, డీఎస్ ఏలుమలై, రవిశేఖర్‌రాజు, ప్రసాద్ నాయుడు, ఆనంద్, విక్కీరాయల్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఘనంగా తిరంగా ర్యాలీ



పుత్తూరు, ఆగస్టు 14 (ఆంధ్ర జ్యోతి): భారతీయుల ఐక్యతకు నిదర్శనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేపట్టామని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. కళాశాలలో గురువారం ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆద్వర్యంలో త్రివర్ణ పతాకాలను పట్టుకుని ర్యాలీ చేపట్టారు. అధ్యాపకులు కోటేశ్వరయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తెలుగు యాదవ్ మహాసభకు రాష్ట్ర అధికార ప్రతినిధిగా అన్నా లోకనాథం



పుత్తూరు,ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): తెలుగు యాదవ్ మహాసభకు రాష్ట్ర అధికారప్రతినిధిగా పుత్తూరు మండలం కు చెందిన అన్నా లోకనాథం నియమితులైనారు. ఈ పదవిలో తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షులు కోన గురవయ్యకు కృతజ్ఞతలను లోకనాథం తెలిపారు. తన వర్గానికి శక్తి మేర పని చేసి పదవికి న్యాయం చేస్తానని అన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



వడమాలపేట, ఆగస్టు 14 (ఆంధ్ర జ్యోతి): మండలం లోని ఎస్వీ పురంలో గురువారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ పుత్తూరు ఆధ్వర్యంలో తిరుపతి వాసన్ ఐ కేర్ హాస్పిటల్ డాక్టర్లు నిర్వహించిన శిబిరంలో 140 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 24 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు. ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కోనేటి రవిరాజు చెప్పారు. చెన్నై కి చెందిన కొండూరు వెంకమరాజు సౌజన్యంతో నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యులు వెంకటేష్, కీర్తి వాకర్స్ సభ్యులు రామ్మోహన్ వర్మ, చంద్రబాబు, వెంకమరాజు, సురేష్, మధురాజు, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న వెంకన్న సేవలో అరులసి పీఠాధిపతి అమ్మన్



వడమాలపేట,ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అప్పలాయ గుంటలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వర స్వామిని తమిళనాడు, కోయంబత్తూరు అరులసి పీఠాధిపతి ఓం శ్రీ యోగ నవశక్తి అమ్మన్ గురువారం దర్శించారు. తమ బృందంతో కోయంబత్తూరు పీఠం నుంచి పాదయాత్రగా వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు అభయ హస్తదీశుడి చారిత్రకతను అమ్మన్‌కు వివరించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారి వేణుగోపాల్ దర్శన ఏర్పాట్లు చేశారు.

రైతుల శ్రేయస్సే ధ్యేయం: భానుప్రకాష్



ట్రాక్టర్ నడిపి.. ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్, ఎంపీ ప్రసాదరావు



ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

నగరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రైతు శ్రేయస్సే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. అన్నదాత సుఖీభవ నిధులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమైనందుకు కృతజ్ఞతగా విజయపురం, నిండ్ర, నగరి, పుత్తూరు, వడమాలపేటకు చెందిన రైతులు నగరిలో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ఓంశక్తి ఆలయంలో పూజలు చేశాక, ట్రాక్టర్ నడుపుతూ ర్యాలీని ఎమ్మెల్యే, ఎంపీ ప్రారంభించారు. మార్కెట్ యార్డు వరకు ఈ ర్యాలీ సాగింది. నగరి టవర్‌క్లాక్ వద్ద ఎన్టీఆర్, ముద్దుకృష్ణమ విగ్రహాలకు నాయకులు, రైతులు కలిసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మార్కెట్ యార్డులో జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ.. ఎన్నడూ లేనివిధంగా మామిడి రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుందని చెప్పారు. రైతులను ఆదుకోవడానికి ఎన్నో పథకాలను ప్రవేశ పెడుతున్నారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు మాటిస్తే నిలబెట్టుకుంటారని ప్రశంసించారు. ఇటీవల ఓ మహిళ ట్రాక్టర్ నడపడం తాను చూశానన్నారు. మహిళలు వ్యవసాయ రంగంలోనూ ముందుండాలని పిలుపునిచ్చారు. నగరి పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్, మండల అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బాలాజి, మార్కెట్ కమిటీ చైర్మన్ గణేష్, నాయకులు వెంకటేశ్వరరావు, రమేష్‌రాజు, అరవ బాలాజి, వేణు, శ్రీనివాసన్, శివ, రవినాయుడు, షణ్ముగంరెడ్డి, శ్రీనివాసులురెడి, కృష్ణారెడ్డి, సురేష్‌నాయుడు, కుమార్‌నాయుడు, మీరా, హేమావతి, సంపూర్ణమ్మ, శ్రీధర్, సలీమ్ చిట్టిబాబు, రమేష్ బాబు, లక్ష్మి పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ప్రతిఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలి





గూడూరు తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, విద్యార్థులు, సూళ్లూరుపేటలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన ఆర్డీవో కిరణ్మయి

గూడూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వివేకానంద కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్ నుంచి పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రతి ఒక్కరూ వారి ఇంటిపైన జాతీయజెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లురాజు, వెంకటేశ్వరరావు, మల్లికార్జున, అబ్దుల్ రహీం, చంద్రమౌళి, బిల్లు చెంచురామయ్య, అమరేంద్ర, సీఐ శేఖర్‌బాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో...

సూళ్లూరుపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక హోలిక్రాస్ సర్కిల్ వద్ద ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తిరంగా ర్యాలీని ప్రారంభించారు. హోలిక్రాస్ కూడలి నుంచి షార్ వై జంక్షన్ వరకు సాగిన ర్యాలీలో పొడవైన జెండాను పట్టుకుని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, రమేష్, ఏజీ కిషోర్, మాధవనాయుడు, చిట్టేటి పెరుమాల్, బీజేపీ నాయకులు ఆదినారాయణరెడ్డి, కిరణ్ కుమార్ గౌడ్, బెజవాడ విజయమ్మ పాల్గొన్నారు.

● వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో కళాశాల నుంచి షార్ బస్టాండు వరకు విద్యార్థులు తిరంగా ర్యాలీ చేశారు. ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బి శంకర్ శర్మ, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ సుబ్రమణ్యం, అధ్యాపకులు శ్రీనివాసులు, ఏడుకొండలు, అమ్మాజీ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు మెరుగైన సౌకర్యాలు: ఎమ్మెల్యే కురుగొండ్ల



సీతారామ ఆలయానికి భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

డక్కిలి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ఉచిత బస్సు ప్రయాణంలో మహిళలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. డక్కిలి మండలం పాతనాలపాడు గిరిజన కాలనీలో రామాలయ నిర్మాణానికి గురువారం జరిగిన భూమి పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన డి.వడ్డిపల్లి గ్రామానికి వెళ్లి సర్పంచ్ వేపమాను చెంచమ్మ సంతాప సభలో పాల్గొని పుష్పగుచ్ఛాలతో ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. వెంకటగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షులు కేవీకే ప్రసాద్ నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, చంద్రారెడ్డి, చంద్రమౌళిరెడ్డి, రంగినేని రాజా పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం: డీఎస్పీ

నాయుడుపేట టౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సమాజంలో చట్టాలను పాటించడం ద్వారా సురక్షితంగా, శాంతియుతంగా జీవించవచ్చని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు అన్నారు. నాయుడుపేట పట్టణం ఎల్‌ఏ సాగరంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో గురువారం రాత్రి విద్యార్థినులకు నిర్వహించిన కార్యక్రమంలో డీఎస్పీ చట్టాలపై అవగాహన అవసరమని చెప్పారు. అర్బన్ సీఐ బాబి, ఎస్ఐ ఆదిలక్ష్మి, సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మీరాజ్యం, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థులు ర్యాగింగ్ చేస్తే చర్యలు

సూళ్లూరుపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ర్యాగింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ మురళీకృష్ణ హెచ్చరించారు. సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ర్యాగింగ్‌పై విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ముచ్చకాల సురేష్, ఏవో మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

'నిష్పక్షపాలనకు నాంది పలుకుతాం'

కోట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘం ద్వారా రైతులకు అండగా నిలిచి అన్ని విధాల ఆదుకుంటామని, నిష్పక్షపాలన అందించి ఆదర్శంగా నిలుస్తామని ఊనుగుంటపాళెం సహకారం సంఘ నూతన చైర్మన్ నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని ఊనుగుంటపాళెంలో గురువారం సహకార సంఘ చైర్మన్‌గా జగన్మోహన్‌రెడ్డి, సభ్యులుగా పట్టపు వెంకటేశ్వర్లు, పాకనాటి జనార్ధన్‌లతో సీఈవో శ్రీనివాసులురెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. రైతు రాయితీలు, సహకార సంఘ సేవలపై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది.

16, 18తేదీల్లో చెన్నై-గుమ్మిడిపూండి మధ్య 17 సబర్బన్ రైళ్ల రద్దు

పెరంబూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చెన్నై డివిజన్ పరిధిలోని పొన్నేరి-కవరైపేట రైల్వే స్టేషన్ల మధ్య రైలు మార్గాల్లో మరమ్మతుల కారణంగా ఈ నెల 16, 18 తేదీల్లో చెన్నై సెంట్రల్-గుమ్మిడిపూండి మధ్య 17 సబర్బన్ రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ● చెన్నై బీచ్-గుమ్మిడిపూండి ఉదయం 9.40, మధ్యాహ్నం 12.40, చెన్నై సెంట్రల్-సూళ్లూరుపేట ఉదయం 10.15, మధ్యాహ్నం 12.10, 1.05, గుమ్మిడిపూండికి ఉదయం 10.30, 11.35, ఆవడికి రాత్రి 11.40, సూళ్లూరుపేట-నెల్లూరు మధ్యాహ్నం 3.50 గంటల సబర్బన్ రైళ్ల రద్దు. ● గుమ్మిడిపూండి-చెన్నై బీచ్ ఉదయం 10.55, సెంట్రల్‌కు మధ్యాహ్నం 12, 2.30, 3.15, సూళ్లూరుపేట-సెంట్రల్ మధ్యాహ్నం 1.15, రాత్రి 9, నెల్లూరు-సూళ్లూరుపేట సాయంత్రం 6.45 గంటల సబర్బన్ రైళ్ల రద్దు. ● చెంగల్పట్టు-గుమ్మిడిపూండి ఉదయం 9.55 గంటలకు వెళ్లే సబర్బన్ రైలు చెన్నై బీచ్ వరకు మాత్రమే నడుస్తుంది. గుమ్మిడిపూండి-తాంబరం మధ్యాహ్నం 3 గంటల రైలు చెన్నై బీచ్ నుంచి బయల్దేరుతుంది.

ప్రత్యేక రైళ్లు...

చెన్నై సెంట్రల్-పొన్నేరి ఉదయం 10.30, మీంజూరు ఉదయం 11.35, చెన్నై బీచ్-పొన్నేరి మధ్యాహ్నం 12.10, పొన్నేరి-చెన్నై సెంట్రల్ మధ్యాహ్నం 12.18, 3.33, మీంజూరు-చెన్నై సెంట్రల్ మధ్యాహ్నం 2.50 గంటలకు ప్రత్యేక రైళ్లు నడుపనున్నారు.

ఇరకం కష్టాలకు చెల్లు

● ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

తడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల ఇరకం దీవి కష్టాలకు ఇప్పటికి పరిష్కారం లభించింది. ఇరకం కుప్పం గ్రామస్తులకు కూటమి ప్రభుత్వం ఇళ్ల పట్టాలను మంజూరు చేసి, వారిని పులికాట్ తీరం నుంచి ఒడ్డుకు తీసుకొస్తుంది. దాంతో ఆ గ్రామస్తుల ఆనందానికి అవధుల్లేని పరిస్థితి. గురువారం ఇళ్ల పట్టాలను అందుకున్న గ్రామస్తులు ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ హామీతో పొంగిపోతున్నారు.

ఇన్నాళ్లు ఎవరూ ఆదుకోలేదు

ఏ పనికైనా పులికాట్ సరస్సులో గంటపాటు ప్రయాణిస్తే తప్ప గమ్యం చేరుకోలేం. వరదల సమయంలో పడవ ప్రయాణం ప్రమాదమని తెలిసినా ప్రయాణం తప్పదు. ఇన్నాళ్లు ఎంత మందికి మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు.

- పెరియవట్టు సరస్వతి ఇరకం కుప్పం

ఐదేళ్లుగా ఇండ్ల స్థలాల కోసం ఎదురుచూశాం

ఐదేళ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నాం. గత ప్రభుత్వంలో అధికారులను, నాయకులను కలిసి తమ కష్టాలు చెప్పుకుని, మాకు ప్రత్యామ్నాయంగా పూడికుప్పడంలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని వేడుకున్నాం. ఈ ప్రభుత్వం ఇళ్ల కేటాయించి ఆదుకుంది. అందుకు వారికి రుణపడి ఉంటాం. అయితే ఈమె వైసీపీకి చెందిన సర్పంచ్. వారి దంపతులిద్దరూ నేటికీ వైసీపీలో కొనసాగుతుండడం విశేషం.

- వల్లింబేడు మీన, ఇరకం సర్పంచ్

సంచార జాతుల వారికి దుకాణాల ఏర్పాటు

● అడ్డుకున్న మినీ లారీ కార్మికులు, సీఐటీయూ నేతలు

నాయుడుపేట/నాయుడుపేటటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఆర్టీసీ బస్టాండు సమీపంలో నివసిస్తున్న సంచార జాతుల (నక్కలోళ్ళు)కు 12 దుకాణాలు నిర్మించేందుకు గురువారం మున్సిపల్ అధికారులు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలోనే ఎన్నో ఏళ్ళుగా స్టాండు ఏర్పాటు చేసుకున్న మినీ లారీ కార్మికులతోపాటు సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఇక్కడ దుకాణాలు నిర్మిస్తే జీవనోపాధిని కోల్పోతామని భైఠాయించి నిరసన తెలిపారు. సీఐ బాజీ, మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లాలు మినీ లారీ వాహనదారులతో మాట్లాడి వారి వాహనాల నిలుపుదలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని నచ్చచెప్పారు. అయినప్పటికీ వారు వినకపోవడంతో మినీ లారీ కార్మికులతో పాటు సీఐటీయూ నాయకులను పోలీసు స్టేషనుకు తరలించారు. ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలియజేస్తున్న వారిని పోలీసులు స్టేషనుకు తరలించడం అన్యాయమని సీఐటీయూ నాయకులు ఖండించారు. మరలా వారితో చర్చలు జరిపి దుకాణాల నిర్మాణ పనులకు సహకరించాలని, స్టాండు కోసం ప్రత్యామ్నాయ స్థలం చూపుతామని చెప్పడంతో వారు వెనుతిరిగి వెళ్ళారు. నిరసన తెలియజేసిన వారిలో మినీ లారీ కార్మికులు సతీష్, మస్తాన్ రెడ్డి, గిరి, రమణయ్య, గంగయ్య పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టిన కారు

● కోమాలోకి వెళ్లిన ద్విచక్ర వాహనదారుడు

డక్కిలి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మునేంద్ర అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిన సంఘటన లింగసముద్రం వద్ద గల జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకొంది. డక్కిలి ఎస్ఐ శివశంకర్ కథనం మేరకు.. మండలంలోని చాపలపల్లి గ్రామానికి చెందిన యాచమనేని మునీంద్ర లింగసముద్రం గ్రామంలో బంధువుల ఇంట్లో జరిగే వేడుకలో పాల్గొనేందుకు మోటారు సైకిల్‌పై వెళుతుండగా, లింగసముద్రం క్రాస్ రోడ్డు వద్దకు రాగానే రాపూరు వైపు నుంచి వేగంగా వస్తున్న ఓ కారు ఢీకొంది. దీంతో మునీంద్ర తీవ్ర రక్త గాయాలతో రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతడిని 108లో వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందంటూ అతడిని తిరుపతిలోని ఒక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. గురువారం నాటికి కూడా మునీంద్ర పరిస్థితి విషమంగానే ఉందని అక్కడి వైద్యులు తెలిపారు. పోలీసులు ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ యువ నాయకుడి మృతికి సంతాపం

తడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఐటీడీపీ మండల అధ్యక్షుడు లోకేష్ మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. మండల పరిధిలోని కొండూరు గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకుడు నిమ్మల లోకేష్ (30) గురువారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే టీడీపీ నాయకులతో కలిసి వెళ్లి లోకేశ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కామిరెడ్డి మురళిరెడ్డి, సుబ్రమణ్యం, పూడి శెల్వం, బొమ్మన్ శ్రీధర్ పాల్గొన్నారు. ● లోకేష్ కుటుంబ సభ్యులకు తక్షణ సహాయం కింద టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్ రూ.2 లక్షలను ఆ పార్టీ నాయకులు ఆకుతోట రమేష్, మాధవనాయుడు చేతుల మీదుగా అందజేశారు.

సీపీఐ ఆరోపణలు ఖండించిన టీడీపీ

రేణిగుంట ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి) టీడీపీ నాయకులపై సీపీఐ నాయకుడు హరినాథ్ రెడ్డి చేసిన ఆరోపణలను టీడీపీ నాయకులు ఖండించారు. గురువారం పద్మానగర్‌లో టీడీపీ నాయకుడు రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల రెవెన్యూ అధికారులు వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమంగా నిర్మించిన 77 ఇళ్లను కూల్చి వేశారని, దీనికి సంబంధించి సీపీఐ జిల్లా నాయకులతో కలిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరినాథ్ రెడ్డి పద్మానగర్‌లో ఇల్లు కూల్చి వేసిన స్థలాన్ని పరిశీలించాలన్నారు. వాస్తవాలు తెలుసుకోవాలని పేర్కొన్నారు. అక్రమంగా నిర్మించిన స్థలంలో పద్మానగర్‌కు సంబంధించిన కమ్యూనిటీ హాలు, అంగన్వాడీ, ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్నామన్నారు.

రేణిగుంటలో తిరంగా ర్యాలీ

రేణిగుంట ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రేణిగుంటలో దేశ సమైక్యతను చాటుతూ విద్యార్థులు చేసిన తిరంగా ర్యాలీ ఆకట్టుకుంది. గురువారం ఉదయం వన్నెకుల క్షత్రియ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ తేజవతి ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర, నాగార్జున పబ్లిక్ స్కూల్ విద్యార్థులు కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, మధుకర్, శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, పవన్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

కేవీబీపురం: మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు బాబుయాదవ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి సాయిబాబా మందిరం వరకు జాతీయ జెండాలతో ర్యాలీ చేపట్టారు.

మాజీ ఎమ్మెల్యే చెంచురెడ్డి కుటుంబసభ్యులకు పరామర్శ



శ్రీకాళహస్తి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే చెంచురెడ్డి కుటుంబసభ్యులను గురువారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ చింతామోహన్ పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో చెంచురెడ్డి మృతిచెందిన విషయం విదితమే. ఆయన అంత్యక్రియలకు చింతామోహన్ హాజరు కాలేకపోయారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం చెంచురెడ్డి ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనవెంట కాంగ్రెస్ నాయకులు నరేంద్రనాయుడు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబైన విమానాశ్రయం



రేణిగుంట ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు తిరుపతి విమానాశ్రయాన్ని ముస్తాబు చేశారు. గురువారం విమానాశ్రయం భవనానికి విద్యుత్ దీపాలంకరణతో తీర్చిదిద్దారు. రాత్రి సమయంలో విమానాశ్రయం భవనం తిరువన్న పతాక రంగులతో వెలిగించారు.79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా విమానాశ్రయంలోని భద్రత అధికారులు ప్రత్యేక విన్యాసాలు, డ్రిల్లును నిర్వహించనున్నారు.:

అరాచకానికి చరమగీతం పాడిన పులివెందుల ఓటర్లు



శ్రీకాళహస్తి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల అరాచకానికి ఓటర్లు చరమ గీతం పాడారని తంగేళ్లపాలెం సింగిల్‌విండో చైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యయుతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జడ్పీటీసీ ఉప ఎన్నికలు జరిగాయన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిల్లకూరు బాలసుబ్రహ్మణ్యం, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం గెలిచింది : ఆదిమూలం

పిచ్చాటూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్టలలో ప్రజాస్వామ్యం గెలిచిందని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. గురువారం పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాల ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు గెలుపొందడంపై పిచ్చాటూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ విజయంపై హర్షం వ్యక్తం చేశారు.

స్నేహపూరిత వాతావరణంలో విద్యను అభ్యసించండి

నారాయణవనం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కళాశాలలోని సీనియర్లు, జూనియర్ విద్యార్థులు స్నేహపూరిత వాతావరణంలో విద్యను అభ్యసించాలని సీఐ రవీంద్ర, ఎస్ఐ రాజశేఖర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జనార్ధనరాజు, మధు, రమేష్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ అన్నదానం

శ్రీకాళహస్తి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద జనసేన నాయకులు ఆధ్వర్యంలో గురువారం డొక్కా సీతమ్మ స్ఫూర్తితో పవన్ కల్యాణ్ ఆశయ సాధనలో భాగంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, తేజ, ప్రదీప్ కుమార్, మహేష్, మణి, నవీన్, మునిచంద్ర, చందు, సాయి, కత్తిమణి, మునికుమార్, రమేష్‌బాబు, మోహన్, వీరమహిళలు బత్తెమ్మ, శకుంతలమ్మ పాల్గొన్నారు.

ఐడీ కార్డుల పంపిణీ

వరదయ్యపాళెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారిపాకం జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు గ్రామానికి చెందిన వినోద్, నాగమణి దంపతులు సొంత నిధులు వెచ్చించి ఐడీ కార్డులు తయారు చేసి పంపిణీ చేశారు. పాఠశాలలో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రవీంద్రరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు.

మరుగున పడ్డ సత్యవేడు స్వాతంత్ర్య సమర యోధులు..!



ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని శిలాఫలకం

సత్యవేడు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్య సమరంలో సత్యవేడు ప్రాంతం నుంచి పలువురు నాయకులు కీలక పాత్ర పోషించారు. బ్రిటీష్ వారికి ఎదురు తిరిగి స్వాతంత్ర్య పోరాటాల్లో పాలు పంచుకున్నారు. సత్యవేడుకు చెందిన ఏ.సుబ్బారావు, ఆర్.సీతా రామయ్య, ఈ.వేణుగోపాల్‌రెడ్డి తదితరులు జైళ్ళలో మగ్గారు. వీరి పోరాటాలకు గుర్తుగా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన పాతికేళ్లకు 1973లో అప్పటి భారత ప్రభుత్వం నిర్వహించిన భారత సంవిధానము వేడుకలలో నాటి సత్యవేడు పంచాయతీ సమితి, ప్రస్తుత ఎంపీడీవో కార్యాలయంలో వారి పేర్లతో శిలాఫలకాలను ఏర్పాటు చేశారు. ఈ శిలాఫలకం నేటికీ చెక్కుచెదరకుండా కార్యాలయ ఆవరణలో ప్రత్యేక ఆకర్షణతో నిలిచి ఉంది. అయితే ఈ శిలాఫలకం కార్యాలయానికి ఒక మూలగా మరుగున పడి ఉంది. కార్యాలయంలో మూలన ఉన్న శిలాఫలాకాన్ని ప్రజలందరికీ తెలిసేలా కార్యాలయ ఆవరణ మధ్యలో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రావెల్ టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు



కన్నవరంలో టిప్పర్‌లను అడ్డుకున్న గ్రానమస్తులు

సత్యవేడు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామం రోడ్డు మీదుగా రావడానికి వీల్లేదని మండలంలోని కన్నవరం గ్రామస్తులు గ్రావెల్ టిప్పర్లను అడ్డుకున్నారు. మూడు రోజులుగా నాగలాపురం మండలం గోళ్లవారికండ్రిగ నుంచి సత్యవేడు మండలం కన్నవరం మీదుగా గ్రావెల్ టిప్పర్‌లు చెన్నైకు వెళుతున్నాయి. టిప్పర్ల రవాణా ధాటికి గ్రామంలో రోడ్డు పూర్తిగా దెబ్బతినడమే కాకుండా నీటి పైప్‌లైన్‌లు ధ్వంసమయ్యాయి. తాగునీటికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో కన్నవరంలో గురువారం గ్రామస్తులు టిప్పర్‌లను అడ్డుకుని నిరసన తెలిపారు. క్వారీ నిర్వాహకులు మాత్రం తమకు అనుమతులు ఉన్నాయంటూ రవాణా కొనసాగించారు.

తగ్గేదేలే

నాగలాపురం, వరదయ్యపాళెం మండలాల్లో జరుగుతున్న గ్రావెల్ అక్రమ రవాణాపై గురువారం పలు పత్రికల్లో కథనాలు ప్రచురితమైనప్పటికీ గ్రావెల్ మాఫియా మాత్రం తాము తగ్గేదేలేదంటూ గ్రావెల్ రవాణాను యథేచ్ఛగా కొనసాగించారు. పట్టించుకోవాల్సిన రెవెన్యూ, పోలీసు శాఖ ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి.

రైతు సంక్షేమమే కూటమి లక్ష్యం



ఎడ్లబండిపై ర్యాలీగా వస్తున్న సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ధ్యేయమని శ్రీకాళ హస్తి ఎమ్మెల్యే బొజ్జలసుధీర్‌రెడ్డి తెలిపారు. గురువారం అన్నదాత సుఖీభవ విజయోత్సవర్యాలీలో భాగంగా వందలాది ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఊరందూరు నుంచి ఏపీసీడ్స్ మీదుగా పట్టణంలోని నాలుగుమాడ వీధుల గుండా ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచురెడ్డి మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ అన్నదాతల కష్టం ఫలితంగా నేడు అందరం కడుపు నిండా తింటున్నామన్నారు. అందుకు కూటమి ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోందన్నారు. రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం పాటుపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెంచయ్య నాయుడు, రావిళ్ల మునిరాజానాయుడు, ధనంజయులు నాయుడు, అధికారులు, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

దేశ ఐక్యత కోసమే హర్ ఘర్ తిరంగా



పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల ఐక్యత కోసమే హర్ ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమాలు చేపట్టినట్లు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. ఆగస్టు 13 నుంచి 15వ తేదీ వరకు 'తిరంగా ర్యాలీ, ఇంటిపై జాతీయ జెండా ఎగురవేద్దాం - మన దేశ ఐక్యతను చాటుకుందాం' అనే నినాదంతో గురువారం ప్రజలు, విద్యార్థులు, బీజేపీ నాయకుల జాతీయ జెండాలను చేతబట్టి భారత్‌మాతాకు జై, వందే మాతరం అంటూ నినాదాలు చేస్తూ పట్టణ వీదుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, నాయకులు మేళాగరం సుబ్రహ్మణ్యంరెడ్డి, అమర్‌నాథ్, డిల్లీబాబు, హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడోలో పాపానాయుడుపేట విద్యార్థికి పతకం



యామిని

ఏర్పేడు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పెద్దపరిమి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 8, 9వ తేదీలలో రాష్ట్రస్థాయి జూడో పోటీలు నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ప్రాతినిధ్యం వహించిన పాపానాయుడుపేట జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థిని యామిని 40 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా యామినిని ప్రధానోపాధ్యాయులు మారయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువైన మేధో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అభిషేకాలు జరిపిం చారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

నేడు రక్తదాన శిబిరం

శ్రీకాళహస్తి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ పార్కు సమీపంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించ నున్న ట్లు యువతరం సేవాసమితి సభ్యులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. రుయా ఆస్పత్రిలో రక్త నిల్వలు తక్కువగా ఉన్న నేపథ్యంలో వారి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం రోజున రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తదానం చేసేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు.

ఇంటింటా వైద్య పరీక్షలు

ఏర్పేడు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం కోబాక గ్రామంలో గురువారం ఏఎన్ఎం, ఆశా వర్కర్లు ప్రతి ఇంటిని సందర్శించి ఆరోగ్య పరీక్షలు చేశారు. రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్, రక్తహీనత, వ్యాధులను గుర్తించడానికి ప్రాథమిక పరీక్షలు చేశారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం, ఆరోగ్యశ్రీ సదుపాయం ఉన్న ఆస్పత్రిల్లో ఉచితంగా చికిత్స అందిస్తుందని వివరించారు.

ఏర్పేడు తహసీల్దారుకు ఉత్తమ సేవా పురస్కారం

ఏర్పేడు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు తహసీల్దారు భార్గవి ఉత్తమ సేవా ప్రశంసాపత్రం అందుకోనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం తిరుపతిలో జరిగే వేడుకల్లో మంత్రి ఆనం రామనారాయణరెడ్డ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకోనున్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లమాంబపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో - 2 మునిసుబ్రమణ్యం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వంట నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మోనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

శ్రీకాళహస్తి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచు కోవాలని రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి అన్నారు. పట్టణంలోని భాస్కపేట పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌నియమాలను పాటించాలన్నారు. పోస్కో, ఈవ్‌టీజింగ్, మహిళా భద్రత, సైబర్ సెక్యూరిటీ, డ్రగ్స్ నియంత్రణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

పూజా సామగ్రి వితరణ

రేణిగుంట ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమని పురస్కరించుకొని శ్రీకృష్ణ దేవాలయాలకు సంబంధించిన పూజారులకు పూజా సామగ్రి వితరణ చేశారు. గురువారం స్థానిక వెంకటేశ్వర స్వామి అలయం వద్ద యాదవ సంఘం తరపున పూజా సామగ్రిని వితరణ చేశారు. సబ్ రిజిస్ట్రార్ ఆనంద రెడ్డి, ఏబీవీపీ రాష్ట్ర నాయకులు సోమశేఖర్, కాంగ్రెస్ నాయకులు రావణ, యాదవ సంఘం సభ్యులు వెంకటాద్రి, శ్రీరామ్ పాల్గొన్నారు.

ఆ ఒక్కరూ..ఒప్పుకుంటే..!

- రోడ్డు నిర్మాణానికి భూమి ఇవ్వని ఒకే ఒక్కడు
- ఆగిపోయిన కనమనంబేడు- పాలేడు లింక్ రోడ్డు నిర్మాణం
- దయ చూపితే 20 ఏళ్ల కల సాకారం



కనమనంబేడు గ్రామం దగ్గర పాలేడుకు పోయే లింక్ రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణం కోసం ఎదురు చూస్తున్న ప్రజలు దాదాపు 3వేల మంది. చాలా మంది రైతులు రోడ్డు కోసం తమ భూములు ఇవ్వడానికి అంగీరించాడు. ఒకే ఒక్క రైతు మాత్రం తన భూమి ఇవ్వడానికి నిరాకరించారు. దీంతో 20 ఏళ్ల కల కలగానే మిగిలిపోయింది. అదే మండలంలోని కనమనంబేడు- పెద్ద పాలేడు మధ్య లింక్ రోడ్డు నిర్మాణం. కనమనంబేడు మీదుగా రోడ్డు నిర్మాణం జరిగితే పెద్దపాలేడు, జంబుగోళం, హసలపల్లి, సుగ్గుపల్లి, కోనేటిమిట్ట గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల ప్రయాణంతోనే చేరుకోవచ్చు. ప్రస్తుతం రోడ్డు లేక పోవడంతో పై గ్రామాల ప్రజలంతా జీఎస్‌కండ్రిగ, ఆర్ అనంతపురం గ్రామాల మీదగా పదవమైలు శ్రీకాళహస్తి - తడ రోడ్డు మీదుగా పది కిలోమీటర్ల దూరం ప్రయాణించి మండల కేంద్రానికి వస్తున్నారు.

2004 నుంచి పెండింగ్

కనమనంబేడు పాలేడు లింక్ రోడ్డు నిర్మాణం 2004 సంవత్సరంలో తెరమీదకు వచ్చింది. కనమనంబేడు నుంచి రోడ్డు నిర్మాణం పొలాల మధ్యలో చేపట్టాల్సి ఉంది. చాలా మంది రైతులు భూముల ఇవ్వడానికి ముం దుకు వచ్చారు. ఒకరి



పొలాలు దగ్గర ఆగిపోయిన రోడ్డు

ద్దరు రైతులు భూములు ఇవ్వడానికి నిరాకరించడంతో రోడ్డు నిర్మాణం నిలిచి పోయింది. 2014 టీడీపీ ప్రభుత్వంలో మరోసారి రోడ్డు నిర్మాణం కోసం ప్రయత్నాలు జరిగాయి. కనమనం బేడుకు చెందిన ఒక రైతు భూమి ఇవ్వకపోవడంతో రోడ్డు నిర్మాణం కలగానే మిగిలింది. కూటమి ప్రభుత్వంలోనైనా ఈ రోడ్డు నిర్మాణం జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మెరుగైన విద్యుత్ సేవలందించండి: ఎమ్మెల్యే ఆదిమూలం



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన విద్యుత్ సేవలందించాలని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ఆదేశించారు. గురువారం మండలంలోని పాలమంగలం పంచాయితీలో 3ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 గంటలు 3 ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వలన రైతులకు, ప్రజలకు, చేనేత, మరమగ్గ కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అన్నదాతలకు విద్యుత్ శాఖాధికారులు మెరుగైన సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు సుమన్‌కుమార్, టీడీపీ నాయకులు ఆర్టీ ఏకాంబరం, గోవిందస్వామి, మాణిక్యంరెడ్డి, ఎంపీడీవో అరుణ, విద్యుత్‌శాఖాధికారులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరాలి

నాగలాపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని నాగలాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీలత కోరారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీలత అధ్యక్షతన ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ముఖ్య అతిథిగా స్థానిక డాక్టర్ రామచంద్రన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీలత మాట్లాడుతూ చదువుతోనే భవిష్యత్ బంగారు బాట అవుతుందన్నారు. ఎవరైతే క్రమశిక్షణతో విద్య అభ్యసిస్తారో వారు ఉత్తమ ఫలితాలు సాధించడం ఖాయమన్నారు. డాక్టర్ రామచంద్రన్ మాట్లాడుతూ ఇక్క చదివిన వారు ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. నేటి యువత కూడా ఆ స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. అనంతరం ఫ్రెషర్స్‌డేను పురస్కరించుకుని పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం డా క్టర్ రామచంద్రన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మధుసూదన్, వేలాయుధం, శ్రీనివాసులు, హరినాథ్, దేవేంద్ర, హరి, కుమార్, జాకీర్, హుస్సేన్, సుజాత, అనితాకుమారి, సునీలాదేవి, హేమబిందు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో కర్ణాటక హైకోర్టు జడ్జి



జస్టిస్ సుమలత కుటుంబసభ్యులను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమలత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజస్వామిసన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించిస్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే క్వార్టర్స్‌కు తెలుగంగ తీసుకొస్తా : తుడా చైర్మన్



మొక్కలు నాటుతున్న తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి

రేణిగుంట ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సీఆర్ఎస్ ఉద్యోగుల క్వార్టర్స్‌కు తెలుగు గంగ పైపు లైను ఏర్పాటుకు కృషి చేస్తానని తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సీఆర్ఎస్‌లో జరిగిన స్వచ్ఛత అభియాన్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. సీఆర్ఎస్ సీడబ్ల్యూఎం దేవ సహాయం, ఇతర రైల్వే ఉద్యోగస్తులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం సీఆర్ఎస్‌లోని ఎస్సీ ఎస్టీ, ఓబీసీ యూనియన్ కార్యాలయాలకు వెళ్లి బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నీటి సమస్యను రైల్వే ఉద్యోగులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రానున్న ఆరు నెలల్లో కమిషనర్‌తో చర్చించి తెలుగు గంగ పైప్‌లైన్ వేయించేందుకు కృషి చేస్తానని తెలియజేశారు. నూతన రోడ్లు వేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీడీఎంఎస్ హిమజబాయ్, ఏడబ్ల్యు పీవో శ్రీనివాసరావు, డీవైసీఎంఈ రమేష్, ఏడీఈ రాజమోహన్, మజ్దూర్ యూనియన్ నాయకులు బాబు, సదాశివరెడ్డి, ముని కుమార్, శశిధర్, మునయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాలతో విద్యార్థుల పిరమిడ్ రూపకం

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాలతో విద్యార్థులు పిరమిడ్ రూపంలో నిలుచుని జాతీయ జెండాలను ఎగురవేశారు.

రజనీకాంత్‌ను కలిసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



శ్రీకాళహస్తి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్‌ను ఆయన స్వగృహంలో గురువారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధికి తాను చేస్తున్న పనులను రజనీకాంత్‌కు వివరించారు. ఆయన సుదీర్‌రెడ్డిని అభినందించారు.

పాఠశాలలో వంట సామగ్రి చోరీ

నాగలాపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెళ్లూరు ఎంపీపీ పాఠశాలలో బుధవారం రాత్రి వంట గదిలోని వంట సామగ్రి చోరీ జరిగినట్లు హెచ్ఎం రాజేశ్వరి తెలిపారు. సిలిండరు, స్టౌవ్, ఒక నెలకు సరిపడే ముడి సరకులు చోరీ చేశారని వివరించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పార్టీ పటిష్టతకు సైనికుల్లా పనిచేయాలి : షర్మిల



షర్మిళను సత్కరిస్తున్న తలపా దామోదర్‌రెడ్డి తదితరులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి కార్యకర్తా, నాయకుడూ సైనికుల్లా పనిచేసి పార్టీ పునర్నిర్మాణం కోసం కృషి చేయాలని పీసీసీ అధ్యక్షులు వైఎస్ షర్మిళ సూచించారు. షర్మిళ అధ్యక్షతన గురువారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్రస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా షర్మిళ మాట్లాడుతూ భవిష్యత్తులో పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. ఈ సమీక్షకు తిరుపతి జిల్లా డీసీసీ అధ్యక్షులు బాల గురవం బాబు, శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్లుగా నియమితులైన జేడీ శీలం, మస్తాన్‌వలిను బాలగురవంబాబు, తలపా దామోదర్‌రెడ్డి ఘనంగా సత్కరించారు.

పాఠశాలకు బల్లల వితరణ



శ్రీకాళహస్తి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు ఐడీబీఐ బ్యాంకు శ్రీకాళహస్తి శాఖ రూ.లక్ష విలువైన విద్యార్థులు కూర్చునే బల్లలను సీఎస్ఆర్ పథకం కింద వితరణ చేశారు. ఐడీబీఐ బ్యాంకు మేనేజరు సూర్యప్రకాష్, ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య, బ్యాంకు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కెనరా బ్యాంకు మేనేజరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో 5, 6, 7వ తరగతి చదివే ఆరుగురు పేద విద్యార్థులకు రూ.3వేలు, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు రూ.5వేలు చొప్పున మంజూరు చేశారు.